
UESI
ANDHRA PRADESH

Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.5
March 2024



## ప్రభావితం చేయాలి

# పరిశుద్ధ తరాన్ని తయారు చేయాలి

ఈ నాడు మన సమాజంలో ఎదుర్కొనే అనేక సమస్యలకు కారణం కుటుంబ వ్యవస్థ కుంటుపడడమే! బలత్కారాలు, దోపిడీలు, దొంగతనాలు, మోసాలకు కారణం కుటుంబ వ్యవస్థలోని అవకతవకలే! మనం చూస్తున్న ఈ తరం, ప్రాథమికమైన నైతిక సూత్రాల అవగాహన లేని తరం. వీరికి ప్రభుత్వం పట్ల గౌరవం, తోటిమానవుల పట్ల సహృదయభావన లేకపోవడానికి వారి మూలాలే కారణం. కుటుంబములో భార్యాభర్తల మధ్య మానసిక అవగాహనలేమి, అధిక సంపద తెచ్చిపెట్టిన జీవన దర్పం, అధునాతన యుగంలోని సుఖజీవనం పట్ల విపరీతమైన మోజు, దేవునిపై నమ్మకాన్ని కాలరాసిన విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం, ఇవన్నీ కలసి కుటుంబంలోని దేవుని ఉద్దేశాన్ని, క్రమాన్ని కూలదోశాయి.


క్రీస్తు ప్రభువు రాకతో లోకంలోని కుటుంబ వ్యవస్థకు నూతన విధివిధానాలు, గమ్యం చేకూరాయి. విమోచించబడిన మానవుల ద్వారా తిరిగి దేవుని ఉద్దేశం కుటుంబంలో నెరవేర్చబడడానికి ఒక అవకాశం కలిగింది. ఈ కుటుంబాలే సమాజానికి, దేశానికి ఆశాజ్యోతులు. కుటుంబ వ్యవస్థనుండే సమాజానికి పౌరులు అందించబడతారు. ఈ పౌరులే దేశ గతిని నిర్దేశించేవారు, నాయకత్వం వహించేవారు కూడా. క్రైస్తవ సమాజానికి ప్రామాణికాలైన ఈ పరిశుద్ధ కుటుంబాలనుండి దేశానికి, సంఘానికి ఆవశ్యకమైన పరిశుద్ధ నాయకత్వం వస్తుంది. అదే సమాజానికి, సంఘానికి నిజమైన సంపద.

దేవుడు పిల్లలనిస్తే వారిని దేవుని కొరకు పెంచడం గొప్ప సవాలుతో కూడిన కార్యం. అనేక విశ్వాస కుటుంబాలకు దీని గురించిన అవగాహన లేదు. ఏమి విత్తుతామో దానినే కోస్తామని ఎరిగియు, విత్తనిదానిని కోయడానికి ఎదురుచూస్తారు. పిల్లలను పరిశుద్ధతలో పెంచని కుటుంబం, పరిశుద్ధ కుటుంబమని చెప్పబడదు. పిల్లలను పెంచడానికి మనకివ్వబడిన 15 సంవత్సరాలలో మొదటి మూడు సంవత్సరాలు అతి కీలక సమయమని చాలా కొద్దిమంది తల్లిదండ్రులకు తెలుసు. ఆ సంవత్సరములలో పసిబిడ్డలు మాటలలో తమ భావాలను వెల్లడించలేకపోయినా వారి మెదడు తల్లిదండ్రుల ప్రతికదలికను గమనించి "గాఢముద్ర (Impression)" అనే అనుభవం ద్వారా తమ మనస్సులో శాశ్వత మానసిక రూపాలను ఏర్పరచుకుంటారు. జీవితంలో వారు కలిగివుండే అలవాట్లలో దాదాపు 60% ఈ కీలక సంవత్సరాలలోనే ఏర్పడుతాయని మనస్తత్వశాస్త్రజ్ఞులు మొత్తుకొంటున్నారు. కానీ వేల సంవత్సరాల క్రితమే సామెతలు 22:6లో "బాలుడు నడవవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు ముసలివాడైనప్పుడు కూడా దాని నుండి తొలగిపోడని" చెప్పిన దేవుని వాక్యం నూటికి నూరుపాళ్ళు సత్యం కదా! విశ్వాసులైన తల్లిదండ్రులు ఈ కీలక సంవత్సరాలలో వారి పరిశుద్ధ ప్రవర్తనను వారి బిడ్డల ఎదుట చూపించాల్సి ఉండగా సమయంలేదని, ఉద్యోగాలు, పరిచర్య అని రకరకాల కారణాల చాటున తమ బిడ్డల జీవితాంతం వరకు నిలిచి ఉండే పరిశుద్ధ ప్రవర్తనకు కావలసిన పెట్టుబడిని నిర్లక్ష్యం చేస్తున్నారనడంలో అతిశయోక్తిలేదు.

పరిశుద్ధ కుటుంబంలో తల్లిదండ్రుల పాత్రను తక్కువ చేయలేము. వారి అనుదిన చర్యలో దేవునితో కలసి నడిచే అలవాటు, ఆత్మ దేవుని అధికారం క్రింద నడిచే సమర్పణ లేనప్పుడు వారి పరిచర్య, ఇన్‌వాల్వ్‌మెంట్, కానుకలు మొదలైనవి పరిశుద్ధతను కుటుంబములోనికి తేలేవు. ఒకవేళ బయటనుండి చూచే వ్యక్తులు వీరి గురించి గొప్పగా అనుకుంటే అది కేవలం ఒక భ్రమ మాత్రమే. బిడ్డల జీవితంలో మనం గమనించే క్రమశిక్షణ, వినయపూర్వక ప్రవర్తన, సంభాషణ, పెద్దలపట్ల గౌరవం, దేవుని సన్నిధికి వారిచ్చే గౌరవం, భౌతికమైన శుభ్రత, ఆత్మీయ విలువలు ఇవన్నీ కుటుంబంలోని పరిశుద్ధతకు దర్పణం పడతాయి.

పరిశుద్ధ కుటుంబాలు వాటంతటవే ఆటో మాటిక్‌గా తయారవ్వవు. వాటికి క్రయం చెల్లించాలి. ఈ చెడు సమాజంలో జ్యోతులవలె విశ్వాస కుటుంబాలు దేవుని ప్రేమను, సత్యాన్ని, విలువలను, తమ చుట్టూ ఉన్న ప్రజలకు తమ జీవితాల ద్వారా, తమ పిల్లల జీవితాల ద్వారా తెలియజెప్పగలిగినప్పుడే దేవుని సంకల్పం మన పట్ల నెరవేరుతుంది. పరిశుద్ధతలేని కుటుంబాలనుండి పరిశుద్ధత కొరకు క్రయం చెల్లించే నాయకులు రాలేరు. తల్లిదండ్రుల విలువలే పిల్లలు నేర్చుకుంటారు. ఊరికే వచ్చిన వెయ్యి రూపాయలకంటే కష్టపడి సంపాదించిన పది రూపాయలు విలువైనవని తల్లిదండ్రులు నేర్పించకుండా పిల్లలకు ఎలా తెలుస్తుంది? స్కూల్లో కాపీకొట్టి పాస్ అవడంకన్నా ఫెయిల్ అవడమే గౌరవమని నేర్పవలసింది తల్లిదండ్రులే. లోకం హేళన చేస్తున్నా తాము నమ్మిన దైవసత్యం అనుసరించగల మనోధైర్యం పిల్లలకు నూరిపోసేది తల్లిదండ్రులే. మన యుఇయస్ఐలో ఇలాంటి పరిశుద్ధ కుటుంబాలు కరువైతే మన పునాదులు బలహీనపడినట్లే. విశ్వాస తల్లిదండ్రులారా రండి! మన కుటుంబాలను బలపరచుకుందాం! పరిశుద్ధ తరాన్ని తయారుచేయడానికి నడుంకడదాం! ఇది ఒక పరిశుద్ధ పోరాటం. ప్రభువు పక్షంగా పోరాడితే జయం మనదే.

**- కె. దేవిడ్ రాజ్‌కుమార్,** గుంటూరు




Vol. 30, No. 5 March 2024
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:
Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

CONTACT:
The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:
Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years)
Rs. 2000/-
OVERSEAS (10 Years) - Rs. 2000/-

VIDYARTHI JWALA ACCOUNT NO:
**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:
**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:
**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:
April: Elections
May: Influential Leadership
June: Planning
July: Social Evils
August: Minority - Majority
September: Core Values

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# శుభప్రదమైన నిరీక్షణ

"వణుకుతున్న చేతులు, వంగిపోయిన వేళ్ళు, కృశించిపోయిన కండరాలు, మెలితిరిగిన మోకాళ్ళు, స్పర్శలేని దేహం – ఒకానొక రోజు నీతి వస్త్రాలు కాంతిలో ప్రకాశిస్తూ ధగా ధగా వెలు గులు విరజిల్లుతాయి. చితికిపోయిన వెన్ను, మొద్దుబారి న దేహం, పెళుసుగా విరిగే ఎముకలు, పెంకులు కట్టిన చర్మం, మెదడు చితికి, ఆలోచన శుష్కించి నిస్సహాయతలో ఉన్న నాలాంటి మరెవరికైనా ఇలాంటి నిరీక్షణ ఉందా? నావలె దారుణ నిరుత్సాహంలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించి ఆశ చిగురించగల సత్తా ఎవరికైనా ఉందా? క్రీస్తు పునరుత్థాన సందేశం తప్ప – ప్రపంచంలో మరే మతమైనా, మరే సిద్ధాంతమైనా క్రొత్త మనసును, క్రొత్త హృదయాన్ని, క్రొత్త దేహాన్ని వాగ్ధానం చేయగలవా?

ఖచ్చితంగా ఆయన ముందు నాట్యం చేస్తాను, గంతులు వేస్తాను, గాలిలో విన్యాసాలు చేస్తాను. కాళ్ళముని వేళ్ళమీద సుతారంగా నడుస్తూ ఆయన్ను సమీపిస్తుంటే ఆయన ఎంతో సంతోషిస్తాడు. అయితే నా కొక ఆశ ఉంది. ఆ మహా వేడుక ప్రారంభం కాకముందు, మహా విందుకు అతిధులంతా వేంచేయకముందు, గొర్రెపిల్ల మహోత్సవ వివాహ వేదిక సిద్ధపరచబడక ముందే నేను నా పునరుత్థాన మహిమా మోకాళ్ళ మీద ఉండి అవధులు లేని కృతజ్ఞతా హృదయంతో ఆయన పాదాలపై పడి ముద్దులు పెడతాను" – **జోని ఎరిక్సన్ టడ**

## లోపలి పేజీల్లో...

- పరిశుద్ధ తరాన్ని తయారు చేయాలి - 2
- జీవిత పరమార్థం - 4
- ప్రభావితం చేయాలంటే..- 5
- క్రైస్తవ తల్లుల అవసరత - 8
- ఆధ్యాత్మిక పరిపక్వత - 10
- చిన్నపాప-గొప్ప స్ఫూర్తి - 13
- ఓ పరలోక నివాసి... - 15
- కుటుంబంలో ఐక్యత - 16
- యుఇయస్ఐ ఆణిముత్యాలు - 17
- పరీక్షలకు సిద్ధమేనా? - 18
- శుభ శుక్రవారంలో శుభం ఏంటి?- 21
- సమాధికి అవతల ఉన్న నిరీక్షణ - 23
- చెవులు గలవాడు వినును గాక! - 26
- పథమ స్థానం ఎవరికి?- 29
- స్త్రీ విమోచనకు స్ఫూర్తి - 30
- నేను ఆయన సొత్తు - 32

# జీవిత పరమార్థం

దేవుని ఇష్టానికి అనుగుణంగా
నా ఇష్టాన్ని మలచుకొంటూ
అర్థమైన సత్యాన్ని
ఆచరణలోకి మార్చుకొంటూ
క్రీస్తును పోలి నేను జీవిస్తాను
ఆయనలా నేనూ జయిస్తాను!



జయించిన వారికోసం
నా ప్రభువు వచ్చినప్పుడు
మూర్తీభవించిన విజయంలా
ఆయన ముందు నిలబడతాను
అచ్చం ఆయన పోలికలో
అప్పుడు నేను కనబడతాను.

(మన సహోదరుడు తాళ్ళూరిగారి కలం నుండి జాలువారిన ఒక ఆలోచన)

"జీవించువారికమీదట తమ కొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవాని కొరకే జీవించుటకు ఆయన అందరి కొరకు మృతిపొందెననియు (2 కొరింథీ 5:15) నిశ్చయించుకొన్న" పౌలు గారి మాటలు తాళ్ళూరి గారిని తప్పక ప్రభావితం చేసుంటాయి.

ఒక రోజు తిన్న ఆహారం మిగిలిన రోజులకు ఎలా శక్తిని ఇవ్వదో, ఒకనాటి సమర్పణ ప్రతిదినం మనము ప్రభువు కొరకు జీవించేందుకు ఏమాత్రం సరిపోదు. ఇంతవరకు ఎన్నో సంవత్సరాలు మనం మనకోసమే, మన ఉద్దేశాలు, ప్రణాళికలు, ఇష్టాలు, సౌకర్యాలు, ప్రాధాన్యతలు, ఎజెండాలు నెరవేర్చుకోవడానికే బతికుండవచ్చు. ఇకనైనా ఈ జీవితానికి స్వస్తి చెప్పి మన స్థానంలో మృతిపొంది తిరిగి లేచిన వాని కొరకే జీవించేందుకు కంకణం కట్టుకోవాలి. మన ప్రాధాన్యతలకు, ప్రణాళికలకు స్వస్తి చెప్పి ప్రభువు ప్రాధాన్యతలు, ప్రణాళికలు నెరవేర్చాలి. ఇందులో భాగంగా క్రీస్తు మనపట్ల చూపించిన ప్రేమనే మన విద్యార్థులకు, గ్రాడ్యుయేట్స్‌కు కనపరచాలి. ఇందులో ప్రధానమైనది, జీవించువారిక మీదట తమకొరకు కాక, తమ నిమిత్తం మృతిపొంది తిరిగిలేచిన వాని కొరకే జీవించాలి. ఆ పరివర్తన మన పరిచయస్తులలో, పరిచర్యలో, పరివారంలో ఉన్న వారందరినీ – మనల్ని పరికించి చూసే ప్రతి ఒక్కరినీ పులకరింప చేసేలా, పరవశింప చేసేలా ఉండాలి. అదే మన శేష జీవితానికి పరమార్థం కావాలని కోరుకొంటున్నాను. మనలో వచ్చిన ఈ పరివర్తన పరమ తండ్రి హృదయాన్ని తప్పక పరవశింప చేయాలి.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు





# ప్రభావితం చేయాలంటే ప్రజలపై పెట్టుబడి పెట్టాలి

మార్చి 8, ఇంటర్నేషనల్ ఉమెన్స్‌డేని ప్రపంచమంతా జరుపుకొంటారు. ఆ రోజు స్త్రీని, స్త్రీ సాధించిన ప్రగతిని, ఆమె శక్తి సామర్థ్యాలను జ్ఞాపకం చేసుకొని గౌరవిస్తారు. "ఇల్లాలు చదువు ఇంటికి వెలుగు", "ఇంటిని చూసి ఇల్లాలిని చూడు" ఇలా స్త్రీ ప్రత్యేకతలను అనేకరకాలుగా చెప్పారు. అంటే స్త్రీ సహజంగా ఇతరులను ఒప్పించగలదని, ప్రభావితం చేయగలదని అర్థం అవుతుంది.

## యోకెబెదు ప్రభావం

సుమారుగా 3500 సం॥ల క్రితం ఒక స్త్రీ తన దేశాన్ని, చరిత్రను, బైబిల్‌లో పాత, క్రొత్త నిబంధనల ను కూడా ప్రభావితం చేసింది. ఆమె ఎవరో కాదు, "యోకెబెదు". లేవీ వంశస్థురాలు, అమ్రాము భార్య, అహరోను, మిర్యాము, మోషేలకు తల్లి. ఇశ్రాయేలీయుల చరిత్రలో గొప్ప ప్రభావం చూపిన స్త్రీగా నిలిచిపోయింది.

తన జీవితంలోకి ఒకసారి తొంగి చూస్తే మనం కూడా ప్రభావితమవుతాము. ఆమె బానిసత్వంలో పుట్టి పెరిగింది. అయినా దేశ చరిత్రను దిశా, నిర్దేశం చేసింది. పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నా అంధకార దినాలలో సహితం విశ్వాసంతో, ధైర్యంతో, దర్శనంతో ముందుకు వెళ్ళింది. ఆ దర్శనాన్ని ముందు తరాలకు అందించింది. ఎదురైన విపత్కర పరిస్థితులను శ్రమలు గా తీసుకోలేదు కాని, వాటిని అర్థం చేసుకొంటూ దేవుని కొరకు నిలబడడానికి అవకాశాలుగా మలచు కొంది. సమయాన్ని అర్థవంతంగా, జ్ఞానయుక్తంగా ఉపయోగించుకొంది.

ఫరో ఆజ్ఞకు భయపడకుండా ధైర్యంగా మోషేని మూడు నెలలు రహస్యంగా పెంచడంలో తన నేర్పరితనం, తెగువ, ప్రాణ భయాన్ని కూడా అధిగమించడం మనం చూడవచ్చు.

ఆ దినాలలో ఇశ్రాయేలీయులను నడిపించే నాయకులు లేక నాయకత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ఆ అవసరాన్ని గుర్తించి ఇశ్రాయేలీయులకు గొప్ప నాయకుల్ని తయారుచేసింది.

ఒక స్త్రీగా తనేమి చెయ్యగలదో, తన శక్తి, సామర్థ్యాలకు మించి చేసింది. తను చేయలేని విషయాలలో దేవుని మీద ఆధారపడింది. విశ్వాసంతో ముందుకెళ్ళింది. తను జీవించింది కొంత కాల మే. కానీ తన బిడ్డల జీవితాల ద్వారా కూడా తను జీవించింది. అహరోను, మోషే, మిర్యాము అనే గొప్ప నాయకుల్ని ఇశ్రాయేలీయులకు అందించింది.

ఇశ్రాయేలీయులను బానిసత్వము నుండి విడిపించి వాగ్దాన దేశానికి నడిపించడానికి ఒక నాయకుని కోసం దేవుడు చూస్తున్నప్పుడు మోషే కనపడ్డాడు. యాజకుని నియమిద్దామని అనుకొన్నప్పుడు అహరోను కనబడ్డాడు. స్త్రీలను నడిపించే నాయకురాలి కొరకు చూస్తున్నప్పుడు మిర్యాము కనబడింది. దేవుడు వారిని ఎంచుకొనేలా బిడ్డలను తయారు చేసింది.

యోకెబెదు పేరు బైబిల్‌లో చాలా తక్కువ వాక్యభాగాలలో రాయబడింది (నిర్గమ 2:1-10; నిర్గమ 6:20, సంఖ్యా 26:59). కానీ ఇశ్రాయేలీయుల చరి త్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. క్రొత్త నిబంధనలో కూడా తన ఆనవాళ్ళు బాప్తిస్మమిచ్చు యోహాను దగ్గర మనం చూడవచ్చు. ఇతను లేవీ వంశీయుడు, అహరోను తరంలో నుండి వచ్చి యేసుప్రభువు వారి కొరకు మార్గాన్ని సిద్ధపరచిన వ్యక్తి.

## లేడీ గ్రాడ్యుయేట్స్‌గా ప్రభావితం చేయాలి

21వ శతాబ్దంలో ఉన్న మనము యోకెబెదు జీవితం అనేక విషయాల్లో మనలను ప్రోత్సాహిస్తుంది. లేడీ

గ్రాడ్యుయేట్స్‌గా యుఇయస్ఐ అనే ఒక మహోన్నతమైన పరిచర్యలో పాలిభాగస్తులమయ్యాము. మనకు అందుబాటులో ఉన్న కళాశాల, యూనివర్శిటీ విద్యార్థులకు సువార్తను అందించి వారిని ప్రభువు వద్దకు నడిపించి, వారిని శిష్యులుగా, నాయకురాళ్ళుగా తీర్చిదిద్దవలసిన ఒక గొప్ప దర్శనాన్ని దేవుడు నీకు, నాకు అప్పగించారు. గనుక ఒక లేడీ గ్రాడ్యుయేట్‌గా మన కుటుంబాలను, మన చుట్టూ ఉన్న విద్యార్థినీలను ప్రభావితం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది.

మనం పెట్టుబడి పెట్టినప్పుడే ప్రభావితం చేయగలం. మన సమయాన్ని, సహాయాన్ని, సహనాన్ని, సాక్ష్యాన్ని, తలాంతులను, ధనాన్ని ఇతరుల జీవితాల మీద పెట్టుబడి పెట్టాలి. అలా పెట్టినప్పుడే మనం ప్రభావితం చేసే వ్యక్తులంగా ఉండగలం.

## అవరోధాల్ని అధిగమించాలి

మన కుటుంబాలను, విద్యార్థినీలను ప్రభావితం చేసే క్రమంలో మనకు సహజంగా ఈ కింది అవరోధాలు ఎదురవుతాయి.

- పరిస్థితులు అనుకూలంగా లేక పోవడం
- ఉద్యోగం, కుటుంబంతో బిజీగా ఉండడం
- ఆరోగ్యం సహకరించకపోవడం
- ఆర్థికపరమైన అవరోధాలు
- విద్యార్థినీల దగ్గర నుండి సరైన సహకారం, స్పందన లేకపోవడం వలన నిరాశపడడం
- కళాశాల ద్వారాలు మూసుకుపోవడం
- నిందలు, అవమానాలకు గురైన బాధ ఉండడం
- చేసిన పనికి సరైన గుర్తింపు రాక పోవడం.
- ప్రోత్సహించే వారు లేకపోగా, విమర్శించేవారు ఎక్కువవ్వడం

ఇవన్నీ మనకు అవరోధాలుగా ఉన్నా ప్రభువు మనకు ఇచ్చిన దర్శనం "సాతాను చెరలో ఉన్న విద్యార్థినీలను ప్రభువు చెంతకు నడిపించాలన్నది" మాత్రమే మనముందు గురిగా పెట్టుకొని ముందుకు సాగాలి. అవరోధాన్ని ప్రభువు సహాయంతో అధిగమించాలి.

## నా మెంటర్

నేను చాలా దగ్గరగా చూసిన, నన్ను మెంటర్ చేసిన అక్కలలో అనురాధ అక్క ఒకరు. టీచర్‌గా విశాఖ జిల్లా భీమిలిలో పని చేస్తూ అక్కడ మాకు ఓపెన్ హోమ్‌గా ఉండేవారు.

అనారోగ్యంతో ఉండే అత్తగారు, చిన్నపిల్లలు, తన అనారోగ్య సమస్యలు, ఇయు పరిచర్య పట్ల అప్పటికి అంతగా అవగాహన లేని భర్త. కానీ అక్క ఎప్పుడూ పని చేస్తూనే ఉండేవారు. అన్ని అననుకూల పరిస్థితులలో కూడా విద్యార్థుల కొరకు, పరిచర్య పట్ల ఆరాటంతో, భారంతో ఉండేది. ప్రార్థన జీవితం, బైబిల్ స్టడీస్, కౌన్సిలింగ్... ఇవన్నీ తన దినచర్యలో భాగమైపోయాయి. తన కుటుంబ బాధ్యతలు, పరిచర్య ఈ రెండింటిలో దేన్నీ అశ్రద్ధ చేయలేదు. తనని బట్టి తన భర్త కూడా విద్యార్థుల పరిచర్య పట్ల ప్రభావితం చేయబడి గడిచిన 30సం॥ల నుండి యుఇయస్ఐ పరిచర్యలో విరివిగా వాడబడుచున్నారు. తను అరిగి పోతూనే అనేకమంది విద్యార్థినీలను ప్రభువు చెంతకు నడిపి, ప్రభువులో నిలబడడానికి ప్రయాసపడ్డారు. మన వెనుక పరిచర్య చేసిన అక్కలందరూ అలాగే అరిగిపోతూ పరిచర్య చేసినవారే.

## పరిచర్యలో మన బాధ్యత ఏంటి?

"అరిగిపోయినా ఫర్వాలేదు కాని, తుప్పు పట్టి పోకూడదు". ఈ రోజు మనం సంతోషంగా జీవిస్తున్నాం అంటే దేవుని కృప, యుఇయస్ఐలోని అనేకమంది లేడీ గ్రాడ్యుయేట్స్ సమర్పణ ఫలితమే. వారు పరిస్థితులను అధిగమించి ప్రయాసపడ్డారు. ఇప్పుడు ఈ తరాన్ని నడిపించవలసిన బాధ్యత మనపై ఉంది. వ్యక్తిగతంగా మనలో ప్రతి ఒక్కరం ఈ క్రింది విషయాల్లో బాధ్యత తీసుకోవాల్సిన అవసరత ఉంది.

### 1. బైబిల్ స్టడీస్ తీసుకోవడం

టైమ్‌ని ప్లాన్ చేసుకొని సిద్ధపడి బైబిల్ స్టడీకి వెళ్ళగలిగితే క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లలో కన్నా ఎక్కువ రిజల్ట్స్ చూడగలం. అంతే కాకుండా బైబిల్ స్టడీకి ముందు, లేదా తర్వాత కొంత సమయం విద్యార్థినీలతో గడిపితే, స్టూడెంట్స్‌కి ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఇంకా స్టూడెంట్స్ వ్యక్తిగత విషయాలు కూడా తెలుసుకొని వారి కొరకు ప్రార్థించడానికి అవకాశం ఉంటుంది.

ఒకసారి లేడీ గ్రాడ్యుయేట్స్ కాన్ఫరెన్స్‌లో ఒక యాక్టివ్ లేడీ గ్రాడ్యుయేట్ తన అనుభవాన్ని షేర్ చేసింది. "తను హైదరాబాద్ ఓయులో చదువుచున్నప్పుడు మెర్సీ సుజాత అక్క అక్కడ బైబిల్ స్టడీ తీసుకోవడానికి వెళ్ళేవారంట. ఒకరోజు సడన్‌గా మెర్సీ సుజాత అక్క ఆమె బర్త్‌డే తెలుసుకొని

సర్‌ప్రైజ్‌గా కేక్ పట్టుకొని హాస్టల్‌కి వెళ్ళారంట. అది తన హృదయానికి హత్తుకొంది. ఈ విషయం తనను ఆకర్షించి ఈ రోజు పరిచర్య చేయడానికి ప్రోత్సాహాన్నిచ్చింది" అని చెప్పింది. బైబిల్ స్టడీస్‌లో తక్కువమంది ఉండటం వలన ఆత్మీయంగా వాళ్ళ అవసరాలు, ఫిజికల్‌గా వాళ్ళ విషయాలు తెలుసుకొని ప్రోత్సహించవచ్చు.

### 2. విద్యార్థినీల గృహాలను దర్శించడం

మనకు అవకాశం ఉన్నప్పుడు, ఫ్యామిలీగా లేక వ్యక్తిగతంగా ఏదైనా జర్నీ ప్లాన్ చేసుకొన్నప్పుడు వీలు చేసుకుని ఆ రూట్‌లో ఉన్న మన మెంటీస్, బైబిల్ స్టడీ స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ యొక్క ఇంటికి వెళ్ళడానికి ప్లాన్ చేసుకొంటే బాగుంటుంది. అలాగే లోకల్‌గా కూడా మనం షాపింగ్, ఔటింగ్ ప్లాన్ చేసుకొన్నప్పుడు ఆ రూట్‌లో స్టూడెంట్స్ హౌస్ విజిటింగ్ ప్లాన్ చేసుకోవచ్చు.

ఒకసారి కాకినాడలో జరుగుచున్న కాన్ఫరెన్స్‌కి మేము కుటుంబంగా వెళ్తున్నప్పుడు తుని నుండి లోపలికి ఉన్న గ్రామములోనికి వెళ్ళడానికి ప్లాన్ చేసుకొని వెళ్ళాము. వారు ఇతర విశ్వాసంలో ఉన్నవారు. ఆ అమ్మాయి ప్రభువులో కొనసాగడానికి ఇంట్లో చాలా వ్యతిరేకత ఉండేది. వారి ఇంటిని విజిట్ చేయడం ద్వారా వాళ్ళ నాన్నగారు చాలా సంతోషించి "ఈ అమ్మాయి బాధ్యత మీదేనమ్మా" అని చెప్పారు. ఆ తరువాత ఆ అమ్మాయి దేవుని చిత్తానుసారంగా వివాహం చేసుకొని, వాళ్ళు కుటుంబంగా ఎంతో గొప్ప పరిచర్య చేస్తున్నారు. తన కుటుంబంలో అనేకమంది ప్రభువును నమ్ముకొన్నారు. కొంచెం మనం ప్లాన్ చేసుకోవడం వలన దేవుడు మన ద్వారా గొప్ప ఫలితాన్ని ఇస్తారు.

### 3. మెంటరింగ్ చేయడం

మనం అన్ని సమయాలలోను మెంటరింగ్ చేయవచ్చు. మనకు సమయం దొరికినప్పుడు విద్యార్థిని కలుసుకొని చేయవచ్చు. మనకు అలా అనుకూలంగా లేనప్పుడు ఇంట్లోనో, ఒక కామన్ ప్లేస్‌లోనో మీట్ అయ్యేట్లు ప్లాన్ చేసుకోవచ్చు. ముగ్గురు విద్యార్థినీల గురించి బాధ్యత తీసుకోవాలి. ఏదో చేసేశాము అని కాకుండా వారి జీవితంలోనికి తొంగి చూడాలి. వాళ్ళు మన జీవితంలోనికి తొంగి చూసే అవకాశం ఇవ్వాలి. వాళ్ళని మన ఇంటికి ఆహ్వానించి వాళ్ళతో క్యాజువల్‌గా మాట్లాడుతూనే దైవ సంబంధమైన అనేక విషయాలను మాట్లాడవచ్చు. వాళ్ళ కుటుంబం, వారి సమస్యలు, సునిశిత విషయాలను మనం చెప్తున్నప్పుడు, వాటిని వింటూ చూస్తూ కూడా నేర్చుకొంటారు. విద్యార్థినీలను మన ఇంటికి ఆహ్వానించేటప్పుడు తనతో ఒక జూనియర్‌ని, ఒక అవిశ్వాసిని కూడా తీసుకొని వచ్చేటట్లు ప్రోత్సహిస్తే వారితో మన సంబంధం కొనసాగుతూనే ఉంటుంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని విద్యార్థినీల కొరకు వినియోగిద్దాం.

### 4. సందర్భాలను ఉపయోగించుకోవాలి

మన కుటుంబంలో, లేకుంటే విశ్వాస విద్యార్థుల విషయంలో ఏదైనా ఒక పుట్టిన రోజు, పెళ్ళి రోజు, పెళ్ళి కూతుర్ని చేసే సందర్భాలను మనం చక్కగా వినియోగించుకొని, మన కాంటాక్ట్‌లో ఉన్న విద్యార్థినీల ను వాళ్ళ స్నేహితురాళ్ళను మన ఇంటికి ఆహ్వానించి, గాస్పల్, ప్రీ మారిటల్ కౌన్సిలింగ్, ఫెలోషిప్ కొరకు ఉపయోగించుకోవచ్చు. మీటింగ్, క్యాంప్, బైబిల్ స్టడీ అంటే అంతగా ఇష్టపడని వారు ఫంక్షన్ అంటే హ్యాపీగా రావడానికి అవకాశం ఉంది.

### 5. సోషల్ మీడియాని ఉపయోగించుకోవచ్చు

బయటకు వెళ్ళలేని వారు – అంటే అనారోగ్య సమస్యలు, ఇంటి పరిస్థితులు అనుకూలంగా లేనివారు, వయసులో పెద్దవారు చక్కగా సోషల్ మీడియా – వాట్సాప్, చాటింగ్, వీడియో కాల్స్, ఫోన్ కాల్స్ చేస్తూ విద్యార్థినీలతో, యంగ్ గ్రాడ్యుయేట్స్‌తో మాట్లాడుతూ వారిని ప్రోత్సహించవచ్చు. ఆన్‌లైన్ బైబిల్ స్టడీ, ప్రేయర్స్ కూడా నిర్వహించవచ్చు.

### ముగింపు

మనం పరిచర్యలో చేసే ప్రయత్నాలకి తగిన ప్రతిఫలం మన జీవిత కాలంలో మనం పొందక పోయినా, నిత్యజీవంలో న్యాయాధిపతియైన ప్రభువు ఘనంగా ఇస్తాడు. మనం మరణించినా మనం చేసిన పరిచర్య జీవిస్తుంది. యోకెబెదు తన పరిచర్య ఫలం తను పూర్తిగా చూడకపోయి ఉండవచ్చు. కానీ అప్పటి ఇశ్రాయేలీయుల నుండి ఇప్పుడు చదువుచున్న మన వరకూ కూడా ఆమె జీవితం ప్రభావం చేస్తూనే ఉంది. ఆమె మాటకంటే ఎక్కువగా ఆమె జీవితం మనతో మాట్లాడుతుంది.

*"మీరు ఒక శతాబ్దాన్ని ప్రభావితం చేయాల నుకొంటే ప్రజలపై పెట్టుబడి పెట్టాలి"*

**– సుధా ఆనంద్,** యన్ఏడి జోన్, వైజాగ్



# క్రైస్తవ తల్లుల అవసరత

అవిశ్వాసం, స్వార్థం, అపవిత్రత అనే దెబ్బలకు క్రైస్తవ కుటుంబ పునాదులే కదిలిపోతున్న ఈ కాలంలో మాతృత్వం అనే అంశాన్ని లోతుగా తెలుసుకోవాల్సిన అవసరం చాలా ఉన్నది.

గొప్ప తల్లులు లేకపోతే గొప్ప స్త్రీ, పురుషులు ఉండరు. "నేను ఏమై ఉన్నానో, ఏమి అవ్వాలని ఆశిస్తున్నానో దానంతటికీ కారణం దేవతలాంటి మా అమ్మే. అందుకు నేను ఆమెకు ఎంతో రుణపడి ఉన్నాను" అని అబ్రహాం లింకన్ అన్నాడు.

స్త్రీ జాతి పవిత్రతని, గొప్పతనాన్ని మనం గౌరవిస్తాము. స్త్రీలు గుర్తించినా, గుర్తించక పోయినా ఒక విషయం మాత్రం నిజం. క్రైస్తవ్యంలోనే వారు పురుషులతో సమానులుగా పరిగణించబడతారు. ఇందుకు వారు క్రీస్తుకు ఎంతో ఋణపడిఉన్నారు. చాలా దేశాల్లో, ఈ రోజుకి కూడా స్త్రీని ఒక అడవిజంతువు కన్నా హీనంగా చూస్తారు. స్త్రీ జాతిని ఉన్నతంగా గౌరవించింది యేసుక్రీస్తు మాత్రమే.

ఈ ప్రపంచాన్ని ఎంతో అద్భుత నివాసయోగ్యమైన ప్రదేశంగా మార్చడానికి కృషి చేసిన స్త్రీలను గూర్చి, దేవుని రాజ్యాన్ని వ్యాపింపజేయడానికి కృషి చేసిన ఎంతోమంది స్త్రీలను గూర్చి బైబిల్‌లో రాయబడింది.

ఇశ్రాయేలీయులు ఎఱ్ఱ సముద్రాన్ని దాటిన తర్వాత ఆనందభరితులైన స్త్రీలకు నాయకత్వం వహించి మిర్యాము ఇలా పాడింది. "యెహోవాను గానము చేయుడి. ఆయన మిగుల అతిశయించి జయించెను (నిర్గమ 15:21). రూతు అన్నిటికన్నా దేవునికే మొదటి ప్రాధాన్యత ఇచ్చింది. ఫలితంగా దావీదు మహారాజు వంశస్తురాలైంది (రూతు 1:16; 4:17). ఇశ్రాయేలీయుల న్యాయాధిపతిగా దెబోరా ఉన్నది (న్యాయా 4:4,5). తన ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఎస్తేరు నాశనం కాబోతున్న తన ప్రజల కోసం విజ్ఞాపన చేసింది (ఎస్తేరు 4:10-16). ఒక స్త్రీలో కలిగిన కృతజ్ఞతాభావం ఆమె కన్నీళ్ళతో ప్రభువు పాదాలను కడిగేటట్లు చేసింది (లూకా 7:38). సువాసననిచ్చు అత్తరుతో ప్రభువును అభిషేకించిన మగ్దలేనే మరియ పునరుత్థానుడైన ప్రభువును మొదటిగా చూసింది, "వెళ్ళి చెప్పు" అన్న ప్రేషిత ఆజ్ఞను మొదట పొందినది (యోహాను 20:17,18; మార్కు 16:9). దేవుని వెంబడించిన, బైబిల్‌లో రాయబడిన ఇంకా అనేకమందిని గూర్చి మనం చెప్పుకోవచ్చు.

కుటుంబంలో తల్లి చాలా కీలకమైన వ్యక్తి అని బైబిల్ చెబుతుంది. భర్త తన భార్య పట్ల చూపించే ప్రేమ మీద ఆధారపడిన ఒక క్రైస్తవ వ్యవస్థే కుటుంబం. పెండ్లి కుమార్తె అయిన సంఘమును క్రీస్తు ప్రేమించిన విధానమే దీనికి కారణం. కాని ఈ రోజుల్లో కుటుంబ వ్యవస్థకు నిర్వచనం బాగా

మారిపోయింది, దిగజారిపోయింది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి.

కుటుంబంలో క్రీస్తు కొరకు జీవించడం క్రైస్తవునికి కఠోరమైన పరీక్ష. నీ స్నేహితుల మధ్య ఒక అద్భుతమైన వ్యక్తిగా జీవించడం చాలా సులభం. ఇతరులు నీ గూర్చి మంచి అభిప్రాయాన్ని కలిగి ఉండేటట్లు నీవు మంచి దుస్తులు, పాదరక్షలు ధరిస్తావు. కాని నీ కుటుంబంలో నీవు క్రీస్తు కొరకు జీవించడం చాలా కష్టం. నీలో, నీద్వారా క్రీస్తు జీవిస్తున్నాడా లేదా అన్న విషయం నీ కుటుంబ సభ్యులు గమనిస్తారు.

నీవు నిజమైన క్రైస్తవుడవైతే ముక్కోపము, అసహనం, తప్పులు ఎంచడం, ఎత్తిపొడుపు మాటలు, నిర్దయ, అనుమానం, స్వార్థం, బద్ధకం వంటి చెడు లక్షణాలు నీ కుటుంబంలో ప్రదర్శించవు. దీనికి భిన్నంగా నీ అనుదిన జీవితంలో నీ కుటుంబంలో ప్రేమ, సంతోషం, సమాధానం, దీర్ఘశాంతం మొదలగు ఆత్మఫలమైయున్న లక్షణాలను, క్రైస్తవ సుగుణాలను ప్రదర్శిస్తావు. ఇవి క్రీస్తును పోలి నడుచుకొనే వ్యక్తి యొక్క లక్షణాలు.

నీ కుటుంబ సభ్యులు మాత్రమే కాదు, నీవు సరుకులు కొనే పచారి షాపు యజమాని, పోస్ట్‌మేన్, వార్తాపత్రికను నీ ఇంటికి తెచ్చే వ్యక్తి మొ॥ వారందరు నీవు చాలా భక్తిగల క్రైస్తవుడవని, నీవు జీవించే ప్రతి నిమిషం క్రైస్తవ విలువలతో జీవిస్తావని గుర్తిస్తారు. నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమించుము అనే శ్రేష్ఠమైన నిబంధన (Golden Rule) శ్రామికులకు, నీ వ్యాపార భాగస్తులకు మాత్రమే గాక, నీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు కూడా వర్తిస్తుందని నీవు తెలుసుకొంటావు.

పవిత్రమైన క్రైస్తవ తల్లులు మన దేశానికి ఎంతో అవసరం. క్రైస్తవ తల్లులు ఎక్కువమంది ఉంటే అపవిత్రత, భక్తిహీనత, చిద్రమౌతున్న కుటుంబాలు ఎంతో గణనీయంగా తగ్గుతాయి. అప్పుడే ఆమె కృపతో క్రీస్తు తనకు ఇచ్చిన పిల్లలను సరైన విధానంలో ప్రభావితం చేయగలుగుతుంది. తల్లి తన పిల్లలపై చూపెట్టే ప్రభావాన్ని మనం కొలవలేము. ఆమె మాదిరిని, నిజాయితీని, అలవాట్లను, దయాగుణాన్ని, కష్టించి పనిచేసే తత్వాన్ని పిల్లలు గ్రహిస్తారు, అనుకరిస్తారు. ప్రపంచంలో అత్యంత కష్టమైన పనులలో ఒకటి ఏంటంటే ప్రస్తుత దుష్ట కాలంలో పిల్లలను, కుటుంబాన్ని ప్రభువు నందు విశ్వాసం, వాక్యపు బోధలలో పెంచడమే. వార, మాస పత్రికల్లో వస్తున్న అసభ్యకరమైన విషయాలు, కథలు, స్కూల్స్‌లో ఉంటున్న అనైతిక పరిస్థితులు, ఇంతకు ముందు తరం వారికి తెలియని మరెన్నో వందల, వేల శోధనలు ఉన్న ఈ కాలంలో దేవుని భయంలో పిల్లలను పెంచడం దేవుని కృపతోనే సాధ్యం. తల్లులు కేవలం తమ స్వంత శక్తితో దీనిని చేయలేరు. తమ పిల్లల కోసం తల్లులు మోకరించి ప్రార్థించినప్పుడే ఇది చేయగలరు.

బాలుడు నడవవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దాని నుండి తొలగిపోడు (సామె 22:6) అని బైబిల్ చెబుతుంది. తల్లిగా నీవు చేయవలసిన మొదటి, అత్యంత ప్రాముఖ్యమైన పని ఏంటంటే నీ పిల్లలు క్రీస్తును అంగీకరించేటట్లు చేయడం. పిల్లలు ఆయనను నమ్ముకొంటే మిగిలిన అన్ని విషయాలు చక్కబడతాయి. శిక్షణను, క్రమశిక్షణను వారు ఇప్పుడు ఇష్టపడక పోయినా దాని గొప్పతనాన్ని వారు తర్వాత అర్థం చేసుకొంటారు. నిన్ను ధన్యురాలని అంటారు (సామె 31:28).

నా తల్లిదండ్రులు నన్ను సండేస్కూల్‌కు ప్రతి ఆదివార ఉదయం పంపేవారు. మధ్యాహ్నం మా అమ్మ మాకు బైబిల్ కథలు చెప్పేది. ఆమె చాలా కఠినంగా వ్యవహరిస్తుందని, మత సంబంధమైన విషయాలు బలవంతంగా నాకు ఎక్కిస్తుందని అనుకొని నేను ఆమె మీద తిరగబడేవాడిని. కాని తర్వాత ముఖ్యంగా ప్రతి మదర్స్ డే రోజున నా చిన్నతనంలో నా తల్లి, నా తండ్రి దేవుని విషయాల్లో నాకు ఇచ్చిన శిక్షణ నా జీవితాన్ని మార్చివేసిందని చెబుతూ ఆ శిక్షణ పట్ల నాకు ఇప్పుడు కలుగుతున్న ప్రేమను, అభినందనను నా తల్లికి తెలియజేస్తుంటాను.

నీ పిల్లలు క్రీస్తును అంగీకరించారా? వారిని క్రీస్తు కొరకు గెలవడానికి నీ శక్తినంతా ధారపోసినా లాభం లేకుండా పోయిందా? వారు క్రీస్తును ప్రభువుగా అంగీకరించక పోయినట్లయితే, వారు జీవించవలసిన విధంగా జీవించనట్లయితే మరి ఎక్కువగా వారి కొరకు ప్రార్థించు.

(డెసిషన్ మ్యాగజైన్ నుండి సంగ్రహించినది)

**– డా॥ బిల్లీగ్రేహం**

# ఆధ్యాత్మిక పరిపక్వత

## ఫిలిప్పీ 3:17-22

### గత సంచిక తర్వాత...



ఆధ్యాత్మిక పరిపక్వతలోకి రావాలంటే మొదట దైవిక మాదిరిలను అనుసరించాలి (ఫిలిప్పీ 3:17). ఈ దైవిక మాదిరులను గూర్చి ఆలోచిస్తూ ఫిలిప్పీ రెండవ అధ్యాయంలో యేసుక్రీస్తు ప్రభువు, అపొస్తలుడైన పౌలు, తిమోతి, ఎపఫ్రొదితుల జీవితాలను చూశాము. ఆధ్యాత్మిక పరిపక్వతలోకి రావాలంటే తర్వాత విషయాలు చూద్దాం.

### 2. చెడ్డ మాదిరిలను గుర్తించి, వారికి దూరంగా ఉండాలి (ఫిలిప్పీ 3:18-19)

"అనేకులు క్రీస్తు సిలువకు శత్రువులుగా నడుచుకొనుచున్నారు; వీరిని గూర్చి మీతో అనేక పర్యాయములు చెప్పి యిప్పుడును ఏడ్చుచు చెప్పుచున్నాను. నాశనమే వారి అంతము, వారి కడుపే వారి దేవుడు; వారు తాము సిగ్గుపడవలసిన సంగతులయందు అతిశయపడుచున్నారు, భూసంబంధమైనవాటి యందే మనస్సు ఉంచుచున్నారు. పౌలు వారికి పెట్టిన పేరు సిలువకు శత్రువులు. సిలువకు శత్రువులు ఎవరు? బీజేపీ వారా? ఆర్‌యస్‌యస్ వారా? భజరంగ్‌దళ్ వారా? శివసేన వారా? శివశక్తి వారా? వీరు కాదు. మరి ఎవరు?

### ఎ. సిలువకు శత్రువులు

#### 1. అనుదినము సిలువను మోయనివారే సిలువకు శత్రువులు

తన వ్యక్తిగత ఆధ్యాత్మిక జీవితములో అనుదినము సిలువను మోయని వారే సిలువకు శత్రువు. లూకా 9:23లో "మరియు ఆయన అందరితో ఇట్లనెను - ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్నుతాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను". క్రైస్తవ ప్రపంచంలో మూడు రకాల సిలువలున్నాయి. 1. ఆకారపు సిలువ. దీనిని గుడిలో పెట్టాము, మెడలో వేలాడ దీశాము, ఉంగరాల మీద వేసుకొని అప్పుడప్పుడు ముద్దుపెట్టుకొంటాము. 2. ఆచారపు సిలువ. మనకు భస్మ బుధవారం నుంచి గుడ్‌ఫ్రైడే వరకు వచ్చేదంతా ఆచారపు సిలువ. 3. ఆధ్యాత్మిక సిలువ. ఆధ్యాత్మిక సిలువ అంటే అవమానం, శ్రమ, మరణం. ఇది ప్రతిరోజూ అనుభవించేది. ఈ దినం నేను సిలువను మోయడానికి సిద్ధపడితే "ప్రభువా నేను నీ కొరకు పొందాల్సిన అవమానాన్ని నాకు ప్రసాదించవా?" అని ప్రార్థించాలి. దినదినం చనిపోయే క్రైస్తవునిగా, నీ కొరకు శ్రమపడే క్రైస్తవునిగా, నీ నామం నిమిత్తం అవమానం పొందే క్రైస్తవునిగా ఉంటానని తీర్మానం చేసుకోవాలి. ఇలా తీర్మానించుకోకపోతే సిలువకు శత్రువులు బయటెక్కడోలేరు, లోపలే ఉన్నారు.

#### 2. సిలువ శక్తిని తక్కువగా ఎంచేవారు

1 కొరింథీ 1:18లో "సిలువను గూర్చిన వార్త, నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి. సిలువలో దేవుని శక్తి ఉంది. అది అనుభవించని వాడు సిలువకు శత్రువే.

#### 3. నా రక్షణకు సిలువ కార్యం చాలదు అని అనుకొనేవాడు

నా పాపక్షమాపణ రక్షణకు యేసుప్రభువు సిలువలో చేసిన కార్యం చాలదు అని అనుకొంటూ దానికి మానవ ప్రయత్నాలు జోడించే వారే సిలువకు శ్రతువులు. యేసు ప్రభువు ఉచితంగా

సిలువ కార్యాన్ని బట్టి రక్షిస్తాను అంటుంటే కాదని మానవ కార్యాలను జోడించేవారు, ఒక పాపి రక్షణకు సిలువ కార్యం చాలదు అని అనుకొనేవారు సిలువకు శత్రువులు.

యేసయ్య సారూప్యతలోకి వచ్చేవారు ఇలాంటి చెడ్డ మాదిరిలను గుర్తించండి. వారికి దూరంగా ఉండండి.

### బి. నాశనమే వారి అంతము

ఇక్కడ వాడిన గ్రీకు పదం 'అనాథమ్'. నాశనమునకు తమ్మునుతాము ప్రతిష్టించుకొన్నవారు. యేసు పేరుతోనే ఉన్నారు, సహవాసంలో కనబడుతున్నారు. కానీ వీరు సిలువకు శత్రువులు. వారి కడుపే వారి దేవుడు. అంటే లోపల కలిగే శరీర కోరికల్ని తీర్చుకోవడానికి వారు బ్రతుకుతారు.

ఒక అమ్మాయి ఏడుస్తూ నాకు ఫోన్ చేసింది. "అన్నా, నాకు వాక్యం తెలియదు. యేసుప్రభువుని నమ్మాను. వాక్యం చెబుతారని ఒకతని దగ్గరకు వెళితే అతను పాపం చేద్దాము రా, అని నా వెంట పడుతున్నాడు. నేను ఏ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నానో అక్కడికే వచ్చేస్తున్నాడు. వాడి శరీర కోర్కెలు తీర్చుకోవడానికి ప్రేరేపిస్తున్నాడు". సంఘంలో, సహవాసంలో అలాంటి వారిని గుర్తించండి, వారికి దూరంగా ఉండండి.

### సి. వారు సిగ్గుపడాల్సిన విషయాల్లో అతిశయపడతారు

చాలామంది ఈ లోకంలో చాలా పెద్ద పెద్ద ఇళ్ళు కట్టుకొంటూ అతిశయపడుతున్నారు. పరలోకంలో ఎంతపెద్ద ఇల్లు కట్టుకొన్నారు? అక్కడ నీవు పెట్టిన పెట్టుబడి ఎంత? దేవుని పని ఏమాత్రం చేయని మనం లోకసంబంధంగా చేశామని అతిశయపడుతుంటాము. సిగ్గుపడాలి. 5 లక్షలు ఖర్చుపెట్టి క్రిస్మస్ ప్రోగ్రామ్ పెట్టాము, కలెక్టర్, యంయల్ఏ గారు వచ్చారు. గ్రీటింగ్స్ చెప్పారు. స్కిట్స్ వేశాము. కొరియోగ్రఫీ పెట్టాము. భోజనాలు పెట్టాము అంటూ కేవలం 20నిమిషాలు దేవునివాక్యం చెప్పించామని గొప్పగా చెబుతుంటారు. ఇలాంటి పనులు ద్వారా ఎవరి ఆత్మకు ప్రయోజనం కలిగించాము? ఇలాంటి విషయాలను బట్టి సిగ్గుపడాల్సింది పోయి అతిశయపడుతున్నామా? సిలువకు శత్రువులు ఇలానే ఉంటారు. వారు సిగ్గుపడాల్సిన విషయాలను బట్టి అతిశయపడుతుంటారు.

> "యేసురాజుగా వచ్చుచున్నాడు, భూలోకమంతా తెలుసుకొంటారు" అని పాడతాం. నిజమేనా? ఈ రోజు నీవు కట్టుకొన్న ఇల్లు, దాచుకొన్న డబ్బులు, జీవిస్తున్న జీవన విధానం యేసు త్వరగా వస్తాడు అన్నట్టుగానే ఉన్నాయా? మనం పాడే పాటలకు, జీవిస్తున్న జీవన విధానానికి, యేసు త్వరగా వస్తాడు అని చెప్పే మాటలకు పొంతన లేకుండా ఉందని లోకస్తులు హేళన చేస్తున్నారు.

### డి. భూసంబంధమైన వాటి మీదనే వారు మనస్సు ఉంచుతారు

కరోనా వచ్చినప్పుడు చాలామంది ప్రార్థించమని అడిగేవారు. అయితే వారిని నేను ఈ ప్రశ్న అడిగేవాడిని. "దేవుడు తగ్గిస్తాడు. బ్రతికిన తర్వాత మీరు ఏంచేస్తారు?". చాలామంది దగ్గర సరైన సమాధానం ఉండేది కాదు. ఎందుకు బ్రతకాలో వారికే తెలియదు గాని బతకాలని ఉందని అంటారు. మరి కొంతమంది 'మాకు పిల్లలు లేరు, దేవుడు పిల్లల్ని ఇచ్చేటట్లు ప్రార్థించమని" అడుగుతారు. అప్పుడు నేను వారిని 'దేవుడు మీకు పిల్లల్ని ఇస్తే ఏం చేస్తారు?' అని అడిగితే సరైన సమాధానం ఉండదు. మన ఆయుష్షు, ఆరోగ్యం, అంతస్తులు, ఉద్యోగం, పిల్లాడికి, పిల్లకు పెళ్ళి చేయాలనే ఆలోచనలతో, మనసుతో బతుకుతూ ఉంటే పరలోకసంబంధమైన మనసు ఎక్కడ ఉన్నట్లు? జీవితాంతం వాటి కోసమే బతుకుతూ ఉండే మనం కాదా సిలువకు శత్రువులం.

మనం ఆధ్యాత్మిక పరిపక్వతలోకి రావడానికి యేసయ్య పోలిక, సంపూర్ణతలోకి రావడానికి తప్పుడు మాదిరిలను గుర్తించండి. వారికి దూరంగా ఉండండి. లేకపోతే మీలో ఆ సారూప్యం, పోలిక రాదని పౌలు అన్నాడు.

### 3. పరలోక సంబంధమైన దృష్టి కలిగి ఉండాలి (ఫిలిప్పీ 3:20,21)

"మన పౌరస్థితి పరలోకమందు ఉన్నది; అక్కడి నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తం కనిపెట్టుకొనియున్నాము. సమస్తమును తనకు

లోపరచుకొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగలదానిగా మార్చును". ఈ రెండు వచానాల్లో మనం పరలోకసంబంధమైన వాటిమీద దృష్టిపెట్టి బ్రతుకుతున్నాము అంటాడు.

### ఎ. మన పౌరస్థితి పరలోకమందున్నది

మన పరలోకమందులమైనా మనం భూమి మీద బతుకుతున్నాము. కాబట్టి మన భాష ఆత్మసంబంధమైనదిగా మారాలి. ఎఫెసీ 4:29లో మన భాష ప్రస్తావన వస్తుంది. మనం పరలోక పౌరులం కాబట్టి మన విలువలు లోకంలో ఉన్నవారి కంటే గొప్పగా ఉండాలి. లోకస్తులు మేము నరహత్య చేయడం లేదు, వ్యభిచారం చేయడం లేదు అని గొప్పగా చెప్పుకొంటారు. కానీ మనం మన సహోదరుని మీద కోపపడడంలేదని, ఒక స్త్రీని మోహపు చూపు చూడకుండా ఉంటామని చెప్పగలగాలి. మా విలువలు గొప్పవి. ఎందుకంటే మా అంతరంగంలో మార్పు వచ్చింది అని చెప్పగలగాలి. మీరు బయటకు కొన్ని పనులు చేయడం మానివేస్తున్నారు. మేము కోరుకొనేది అంతరంగ విలువలు. మేము పరలోకసంబంధమైన మనుష్యులం అని చెప్పాలి. ఇవేనా మన విలువలు? వాటితోపాటే వస్త్రధారణ (1 తిమోతి 2:9) కూడా ఉండాలి. మన వస్త్రధారణ తగుమాత్రం ఉండాలి. ఇది మనకు, ఇతరులకు కూడా మేలే. కొంతమంది తమ్ముళ్ళు బ్రాండెడ్ ప్యాంట్ కొంటారు. దానికన్నీ చినుగులే. ఇదే నేటి ఫ్యాషన్. వీటికి అమ్మాయిలు కూడా అతీతులు కారు. ఒళ్ళు కప్పుకోవడం సంస్కారం. ఒళ్ళు చూపించుకోవడం మంచిది కాదు. హెయిర్ క్రాఫ్‌లు గురించి అయితే చెప్పలేము. సెలబ్రిటీలను అనుసరిస్తున్నారు. విపరీతాలు పనికిరావు. మనం పరలోక పౌరులం, పరలోక పౌరసత్వం కలిగిన వారం. మన భాష, విలువలు, వస్త్రధారణ దేవుని వాక్య ప్రమాణాలకు సరిపోయేవిగా ఉండాలని పౌలు చెబుతున్నాడు.

### బి. యేసుక్రీస్తు రెండవ రాకడకై ఎదురు చూస్తూ బతకాలి

20వ వచనంలో "అక్కడ నుంచి ప్రభువైన యేసు క్రీస్తు అను రక్షకుని నిమిత్తం కనిపెట్టుకొని ఉన్నాము". అంటాడు. ఆయన రాకడ కొరకు ఎదురు చూస్తూ బతుకుదాం. 2 పేతురు 3:11-12లో "ఇవన్నియు లయమై పోవునవి గనుక, ఆకాశములు రవులు కొని లయమైపోవునట్టియు, పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవునట్టియు దేవుని దినపు రాక కొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను." అని పేతురు అంటాడు. అపేక్షించుచూ అనే మాట దగ్గర తెలుగు బైబిల్ ఫుట్ నోట్‌లో "త్వరపెట్టుచూ" అని ఉంటుంది. అంటే, ప్రభువా నీవు ఎప్పుడు వస్తావు. నీవు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉంటాను అని చెప్పాలే గాని ఇంకా నేను సిద్ధపడలేదు, ఇంకొన్ని రోజులు ఆగు ప్రభువా అని అనేవారంగా ఉండకూడదు. హోమ్‌వర్క్ పూర్తి చేసిన విద్యార్థి క్లాస్ టీచర్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటాడు. టీచర్ రాకపోతే బాగుండు అని అనుకొంటాడు. దేవుని పిల్లలంగా ప్రభువు రాకడ కొరకు త్వరపెడేవారమేనా? మనకు నిరీక్షణ ఉందా?

"యేసు రాజుగా వచ్చుచున్నాడు, భూలోకమంతా తెలుసుకొంటారు" అని పాడతాం. నిజమేనా? ఈ రోజు నీవు కట్టుకొన్న ఇల్లు, దాచుకొన్న డబ్బులు, జీవిస్తున్న జీవన విధానం యేసు త్వరగా వస్తాడు అన్నట్టుగానే ఉన్నాయా? మనం పాడే పాటలకు, జీవిస్తున్న జీవన విధానానికి, యేసు త్వరగా వస్తాడు అని చెప్పే మాటలకు పొంతన లేకుండా ఉందని లోకస్తులు హేళన చేస్తున్నారు.


### సి. ఆయన రాకడ వల్ల వచ్చే లాభాలు

ఆయన రాకడ వల్ల మన దీన శరీరానికి మహిమ శరీరం వస్తుంది. భూమి మీద ఎంతకాలం బతికినా మన మనసులు ఎప్పుడూ పవిత్రంగా అవ్వలేవు. ఆయన వచ్చిన రోజున, మనం ఆయన దగ్గరకు వెళ్ళిన రోజు మనం పవిత్రులుగా అవుతాము. కీర్తన 16:11 ప్రకారం ఆయనను చూసిన రోజున మన హృదయంలో ఉన్న ఆశలన్నీ తీరిపోతాయి. గనుక ఆయన ప్రత్యక్షమైన రోజున మన దేహానికి మహిమ, మన మనసుకు పవిత్రత, మన హృదయంలో సంతృప్తి వస్తుంది.

– పి.ఏ.స్వామి, శ్రీకాకుళం

(సదరన్ సర్కార్స్ రెగ్‌కాన్-2024 మూడవ డివోషన్)

కూర్పు: పి. సునీల్ జాకబ్, ఎడిటర్



# చిన్న పాప-గొప్ప స్ఫూర్తి

*ఆరు సంవత్సరాలుగా డబ్బును కూడబెట్టుకొని, 20మైళ్ళు నడిచి వెళ్ళి తన స్వంత భాషలో బైబిల్‌ను సంపాదించుకొని, బైబిల్ సొసైటీ ఏర్పడడానికి స్ఫూర్తినిచ్చిన ఒక చిన్న అమ్మాయి వాస్తవ గాథ ఇది.*

మేరీ 1784 సం॥లో ఉత్తర వేల్సు దేశంలో, టినిధాల్ అనే గ్రామంలో జన్మించింది. భక్తి పూరిత వాతావరణంలో పెరిగిన బాలిక. తండ్రిపేరు జాకబ్, బట్టలు నేసేవాడు. తల్లి మోలీ గుడ్లు అమ్మడం, ఆహార పదార్థాలు కొనడం, వస్తు మార్పిడి చేస్తూ పేదరికంలో ఉన్న కుటుంబం. కానీ విచారకరంగా ఆమె చిన్న వయసులోనే తండ్రి మరణించాడు. ఒక చిన్న పాత గుడిసెలో ఆ అమ్మాయి, తన తల్లి నివసించేవారు. పర్వతాల నీడన, పచ్చని లోయ ప్రాంతంలో వీరి ఇల్లు ఉండేది. వీరి ఇంటి నుండి చూస్తే దూరాన ఉన్న సముద్రము కూడా కనిపిస్తుంది.

“మేరీ, మేరీ” అని దూరం నుండి తల్లి పిలిస్తే ‘వస్తున్నానమ్మా” అంటూ ఆ అమ్మాయి ఇంటి పనుల న్నిటిలో తన తల్లితో పాటు సణుగుకోకుండా పాల్గొనేది. నేలను తుడవడం, కోడి పిల్లలకు నీళ్ళుపెట్టడం, గింజలు వేయడం, వంటపని చేయడం, ఇంటిని శుభ్రంగా ఉంచడం వంటి పనులు చేస్తుండేది.

ఆదివారము ఉదయాన్నే, ఆ రోజు ధరించాల్సిన ప్రత్యేక దుస్తులు ధరించి ఆ గ్రామమునకు రెండు మైళ్ళ దూరంలో ఉన్న చర్చ్‌కి నడిచివెళ్ళేది. పాస్టర్ గారు తోలు బైండింగ్ చేయబడిన ఒక పెద్ద నల్లని అట్ట ఉన్న పుస్తకాన్ని తెరిచేవారు. ఆ పుస్తకములో మాటలను ఆయన చదువుచుండగా, మేరీ సంభ్రమాశ్చర్యాలతో వింటూ, ఆ మాటలను తన హృదయంలో దాచుకొనేది. చర్చి ముగిసిన తర్వాత వినయంగా ముందుకు వెళ్ళి అద్భుతమైన ఆ పుస్తకాన్ని తదేకంగా చూసేది. దాని అట్ట మీద బంగారు వర్ణముతో కొన్ని అక్షరాలు ముద్రించబడివున్నాయి. అవి ‘పరిశుద్ధ గ్రంథము’ అయి ఉండొచ్చని ఊహించింది. ఎందుకంటే ఇంతకు ముందు ఆ పాస్టరు గారు ఆ పుస్తకము పేరు చెప్పారు. “వంకర టింకరగా ఉన్న అక్షరాలు ఎలా అర్థమౌతాయో! ఏ మో! ఆహా! ఆ పుస్తకం నా దగ్గర కూడా ఉంటే ఎంత బాగుణ్ణు! నేను దాన్ని చదవాలనుకుంటున్నాను” అని ఆమె ఆలోచించింది.

ఆ తర్వాత ఆ గ్రామంలో ఒక పాఠశాల ప్రారంభి స్తారని ఒక ఆదివారపు ఉదయాన ఆ పాస్టరు గారు ప్రకటించారు. మేరీ ఎంతో ఉత్సాహపడింది. “అంటే నేను చదవడం నేర్చుకోవచ్చన్నమాట” అని ఎంతో సంతోషపడింది.

ఆ పాఠశాలలో పని చేయడానికి వచ్చిన ఇవాన్స్ గారు, తన భార్యతో కలసి ఒక ఫామ్ హౌస్‌లోకి మారారు. ఇది మేరీ వాళ్ళ ఇంటికి దగ్గర. తన ఇంటి పనులు చకచకా చేసేసి, ఇవాన్స్ గారి ఇంటికి వెళ్ళేది. చదవడం నేర్చుకోవాలన్నది ఆమె దృఢమైన

కోరిక. పాఠశాలలో, ఇంటి పనుల్లో కుమార్తె ఎంతగా కష్టపడుతుందో ఆమె తల్లి గమనించేది.

అలా ఆరు నెలలు గడిచిపోయాయి. ఒక ఆది వారము చర్చ్‌లోని బైబిల్ చదివే అవకాశం వచ్చింది. ఆమె పొట్టిది కావడం చేత ఒక చెక్కబల్ల ఎక్కి చదవాల్సి వచ్చింది. అలా ఎక్కకపోతే బైబిల్‌లోని పదాలు ఆమెకు సరిగా కన్పించవు. ఒకప్పుడు వంకర టింకరగా కన్పించిన వాక్యాలు ఇప్పుడు స్పష్టంగా అర్థమౌతున్నాయి. ఆమె బైబిల్‌ను చక్కగా చదివింది. ఆమె తల్లి ఆమెను చూచి ఎంతో సంతోషించి గర్వపడింది. ఆరాధన ముగిసిన తర్వాత మేరీ తన తల్లి దగ్గరకు పరిగెత్తుకొంటూ వెళ్ళింది. "నాకు కూడా ఒక బైబిల్ కావాలి. నాకు కూడా ఒక బైబిల్ కావాలి" అని చెప్పింది. "మేరీ బైబిల్ చాలా ఖరీదమ్మా, మనదగ్గర అంత డబ్బులేదు" అని వాళ్ళ అమ్మ చాలా మృదువుగా చెప్పింది. "నాకు ఆ విషయం తెలుసమ్మా, అందుకే ఒక బైబిల్‌ను కొనడానికి సరిపడా డబ్బును దాచుకోవాలని నిర్ణయించుకొన్నాను. అది ఎంతకాలమైనా సరే! చిన్న చిన్న పనులు చేసి డబ్బు సంపాదించి, ఆ డబ్బునంతా బైబిల్ కొనుక్కోవడానికే దాచుకొంటాను. బైబిల్‌ను సంపాదించుకోవడం కోసం ఎంతకష్టమైనా చేస్తాను" అని మేరీ తన తల్లితో చెప్పింది.

మేరీ ఖచ్చితంగా అలానే చేసింది. ఆరు సంవత్సరాల పాటు ఒక బైబిల్ కోసం ఆమె తన డబ్బును దాచిపెట్టుకుంది. బాలా అనే ప్రాంతంలో ఛార్లెస్ అనే వ్యక్తి ఉన్నాడు, అతని దగ్గర చాలా బైబిల్స్ ఉన్నాయని ఇవాన్స్‌గారు మేరీకి చెప్పారు. ఇప్పుడు మేరీకి 15 సంవత్సరాలు. కాబట్టి బాలా అనే ప్రాంతానికి నడిచి వెళ్తానని తన తల్లితో చెప్పింది.

"బాలా ప్రాంతము మేరీ ఉండే ఊరికి 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. నీవు అంత దూరం ఎలా నడిచివెళ్తావు?" అని ఆమె మేరీతో అన్నది. కాని మేరీ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. బైబిల్ కోసం ఇప్పటికే చాలా కాలంగా ఎదురు చూస్తుంది. కాబట్టి వెళ్ళడానికే ఆమె నిర్ణయించుకొంది. పర్స్‌లో తన డబ్బులు పెట్టుకొని, కొంత రొట్టె, కొంత జున్ను మూట కట్టుకొని మేరీ బయలు దేరింది.

ఎంత దూరం నడిచినా బాలా గ్రామం రావడం లేదు. లోయలు, వాగులు, కొండలు దాటుకొంటూ మేరీ ముందుకు సాగిపోతుంది. అలసట ఎక్కువై, కాళ్ళు నొప్పులు పుడుతున్న సమయంలో "కమాన్ మేరీ దగ్గరకి వచ్చేసింది. ఇంకొంచెం దూరమే" అంటూ తనను తాను పురికొల్పుకొనేది. ఎట్టకేలకు ఆమె ఆ గ్రామ శివార్లలోకి వచ్చింది. ప్రొద్దుగ్రుంకుతోంది. గుడెసెల్లో నుండి కొవ్వొత్తుల వెలుతురు కన్పిస్తుంది. మేరీ హృదయం ఉత్సాహంతో ఉప్పొంగుతోంది. ఎట్టకేలకు బాలాకు వచ్చింది. ఇవాన్స్ గారు చెప్పిన వర్ణన ఆధారంగా మేరీ బాలా ప్రాంతాన్ని గుర్తు పట్టింది. నూతన ఉత్సాహంతో, నూతన తీర్మానంతో ఆమె ఛార్లెస్ వద్దకు బయలు దేరింది.

ఛార్లెస్‌గారిని ఎలా కలుసుకోవాలో తెలుసుకొంది. చాలా ఇళ్ళ తలుపులు తడుతూ, తడుతూ చివరకు ఛార్లెస్‌గారి ఇల్లును కనుగొన్నది. ఇంటి పెరటి దారి గుండా పరుగెత్తుకొని వెళ్ళి ఓక్ చెట్టు కలపతో తయారు చేయబడిన ఆ ఇంటి తలుపును గట్టిగా తట్టింది. తలుపు తెరుస్తూ ఉండగానే ఒక బైబిల్ ఇవ్వమని ప్రాధేయపడింది. ఒక బైబిల్‌ను సంపాదించుకోవడానికి 25మైళ్ళ దూరం నడిచి ఇక్కడకు వచ్చాను, ఆరు సంవత్సరాలనుండి డబ్బును దాచి పెడుతున్నాను. ఈ డబ్బును తీసుకొని, లెక్కపెట్టుకోండి. నాకు ఒక బైబిల్ ఇవ్వండి" అని అతనితో చెప్పింది. ఎంతో ఆత్రుతతో ఉండడం మూలంగా ఆమె మాటలు తడబడుతూ ఉన్నాయి.

ఛార్లెస్‌గారు ఆశ్చర్యపోయారు. "ముందు నీవు లోపలికి రా, బాగా అలసిపోయినట్లున్నావు, కొంచెం ఏదైనా తిను, తర్వాత మాట్లాడుకొందాం" అని చెప్పాడు. ఎంతో దయతో మాట్లాడాడు. తన పని మనిషిని పిలిచి మేరీని వంటగదిలోనికి తీసుకెళ్ళి భోజనం పెట్టమని చెప్పాడు.

భోజనం చేసిన తర్వాత మేరీ ఛార్లెస్‌కు అంతా వివరించి చెప్పింది. అప్పుడు ఛార్లెస్‌గారు "అమ్మా, బైబిల్ ప్రతులన్నీ అయిపోయాయి. ఒక్కటి ఉందిగాని ఒక స్నేహితునికి మాట ఇచ్చాను. వేల్స్ భాషలో బైబిల్స్ కొరత ఎంతో ఉంది" అన్నారు. మేరీ ఒక్కసారిగా స్తంభించి పోయింది. దు:ఖంతో గొంతు పూడుకుపోయింది. కన్నీరు ధారలుగా ప్రవహిస్తుంది. బిగ్గరగా ఏడ్వసాగింది. ఆమె ఆసక్తిని చూసి ఛార్లెస్ చలించిపోయాడు. తనదగ్గరున్న ఆ ఒక్క బైబిల్‌ను తీసి ఆమెకు ఇచ్చాడు. తన రెండు చేతులతో దాన్ని తీసుకొనే ముందు మేరీ ఆ బైబిల్‌ను కొన్ని నిమిషాల పాటు తదేకంగా చూసింది. హృదయపూర్వకంగా



ఛార్లెస్ గారికి కృతజ్ఞతలు తెలిపింది.

తర్వాత రోజు ఉదయాన్నే లేచి, తాను సంపాదించుకొన్న ప్రశస్తమైన ఆస్తిని చేతపట్టుకుని ఛార్లెస్ గారికి వీడ్కోలు చెప్పి తన ఇంటికి బయలు దేరింది. ఇంటికి రాగానే ఆమెకు ఊరివారు గొప్ప స్వాగతాన్ని పలికారు. దాదాపు ఆ గ్రామంలో ఉన్న వాళ్ళంతా అక్కడకు చేరుకొన్నారు. ఆమె తల్లి ఆమెను గట్టిగా హత్తుకొంది. ఆ ప్రక్కనే ఇవాన్స్ మాస్టారు, పాస్టరు గారు ఉన్నారు. వారు పెద్దగా నవ్వుతూ, చప్పట్లతో ఆమెను అభినందించారు. అక్కడున్నవారందరూ సంతోషంగా ఉన్నారు. మేరీ బైబిల్‌ను చూడాలని వాళ్ళు ఆశతో ఉన్నారు. తన చేతిలోని బైబిల్‌ను పైకెత్తి అందరికీ చూపించింది. “యేసూ, వందనాలు, ఛార్లెస్ వందనాలు” అని తనలో తాను చెప్పుకొంది.

మేరీ అనే ఒక యౌవ్వన బాలిక తాను సంపాదించుకొన్న ఒక కొత్తబైబిల్‌ను హత్తుకొని తన ఊరి కొండలు దాటి వెళ్ళడాన్ని ఛార్లెస్ గారు గుర్తు చేసుకొన్నారు. బైబిల్ కోసం ఇలా ఆత్రుతగా ఉండే వారు వేల్స్ దేశంలోనే కాదు, ఇంగ్లాండ్, స్కాట్‌లాండ్, ఐర్లాండ్ ఇలా అన్ని దేశాల్లో కూడా ఉండవచ్చు అని ఆయన భావించారు. మేరీ జోన్స్ వృత్తాంతాన్ని విని ముందుకు వచ్చిన మరికొంతమంది వ్యక్తులతో కలసి థామస్ ఛార్లెస్ 1804లో బ్రిటీష్ మరియు ఫారిన్ బైబిల్ సొసైటీని స్థాపించాడు.

తన స్వంత భాషలో బైబిల్ సంపాదించుకోవడానికి కష్టపడి చదువు నేర్చుకొని, 6 సంవత్సరాలపాటు శ్రమించి డబ్బును దాచి, బైబిల్ సొసైటీలు ఏర్పడడానికి స్ఫూర్తిగా నిలిచింది. ఎంతోమంది భక్తుల శ్రమ ఫలితంగా మన స్వంత భాషలో బైబిల్ మన చేతుల్లో ఉంది. వారందరి కృషిని బట్టి దేవునిని స్తుతిద్దాం. బాధ్యతగా మనం జీవవాక్యాన్ని ధ్యానిద్దాం, దాని ప్రకారం జీవిద్దాం.

– విజె డెస్క్




## ఓ పరలోక నివాసి...

నాన్న తిట్టాడని కూతురు
అమ్మ తిట్టిందని కొడుకు

పిల్లలు పట్టించుకోలేదని
తల్లిదండ్రులు

భార్య ప్రేమించలేదని భర్త
భర్త పట్టించుకోలేదని భార్య

అశాశ్వత బంధాల్లో చిక్కుకొని
వృధా చేస్తున్న కన్నీళ్లు ఎన్నో?

శాశ్వతుడైన దేవునికి లెక్క ఏం చెప్పగలం...?
ఇంకెంతకాలం దిగులు పడుతూ కృంగిపోదాం?

పరలోక పౌరసత్వం కోసం జీవిద్దాం
గురి, ప్రయాణం, దిశ మార్చుకొందాం!

ఈ లోక యాత్రికులుగా ఉంటూ
వాక్యమనే ఖడ్గంతో..
ఆటంకాలను జయిస్తూ
జీవం గల దేవునితో ప్రయాణిద్దాం..

మర్చిపోవద్దు సుమీ!
ఈ లోకంలో యాత్రికులమే
శాశ్వతులము కాదు కదా..

– యం. రూప, సాలూరు, విజయనగరం

బైబిల్ స్టడీ

# కుటుంబంలో ఐక్యత

**( 2 రాజులు 4:8-37; 8:1-6)**

దైవికమైన వివాహ కుటుంబ వ్యవస్థలు కనుమరుగవుతున్న సమాజంలో మనం జీవిస్తున్నాం. విడాకుల సంఖ్య పెరిపోతున్నది. 'గే' వివాహ హక్కు కోసం అనేకమంది పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నారు. సహజీవనంతో మరికొంత మంది తృప్తి చెందుతున్నారు. వేగంగా మారుతున్న ఇలాంటి సమాజంలో జీవిస్తున్న మనం సార్వభౌముడైన మన ప్రభువు అధికారం క్రింద జీవిస్తూ క్రైస్తవ వివాహం అన్నది స్త్రీ, పురుషుల మధ్య ఒక నిబంధన అనే విషయాన్ని గుర్తుచేసుకొంటూ ఉండాలి. దైవికమైన సంబంధాన్ని భూమి మీద ప్రదర్శించడానికి మనం పిలవబడ్డాము. మానవులను తిరిగి తన వద్దకు తీసుకొని దేవుని పరిచర్యలో 'కలసి పాల్గొనుటకు' క్రైస్తవ వివాహం ద్వారా ఒక స్త్రీ, పురుషుడు ఏకం చేయబడతారు. దేవుని దర్శనాన్ని నెరవేర్చిన అనేకమంది దంపతులను మనం బైబిల్ గ్రంథంలో చూస్తాము. అలా దేవుని ఉద్దేశ్యాన్ని నెరవేర్చిన అద్భుతమైన కుటుంబాలలో ఒకటి షూనేమీయురాలైన స్త్రీ, ఆమె భర్త (2 రాజులు 4:8-37; 8:1-6).

ఇశ్శాఖారు గోత్రములో యెజ్రెయేలు మన్యమునకు దగ్గర్లో షూనేము అను పట్టణము ఉన్నది. ఈ పట్టణం కర్మెలు పర్వతానికి సుమారు 20 కి.మీ. దూరంలో ఉన్నది.

పురుషాధిక్య సమాజంలో, కుటుంబ విషయాలను, కుటుంబేతర విషయాలను తన భర్త సహకారంతో ఒక స్త్రీ నెరవేర్చడం అన్నది చాలా అరుదుగా జరుగుతుంది. కాని సంస్కృతి ఏదైనప్పటికీ, దేవునికి, దేవుని వాక్యానికి లోబడే వారు తమ జీవితంలోని విషయాలను కలసికట్టుగా నెరవేరుస్తారన్న విషయం ఈ వాక్యభాగాన్ని పఠించడం ద్వారా మనకు అర్థమౌతుంది.

**ప్రశ్నలు:**

1. షూనేమీయురాలు ఏయే విషయాల్లో చొరవ తీసుకొంది?



2. తన కుటుంబ లాభం కోసం ఆమె తన హోదాను, ప్రవక్తతో పరిచయాన్ని ఎన్నడూ ఉపయోగించలేదని మనం ఎలా చెప్పగలము?
3. దేవుడు వారి ఆశను ఎలా తీర్చాడు?
4. వీరు ఒకరితో నొకరు ఎలా సహకరించుకొన్నారు?
5. తన బిడ్డ మరణించాడన్న వార్త తన భర్తకు చెప్పకుండా ఉండడానికి కారణాలు ఏమై ఉండవచ్చు?
6. తన పనిని నెరవేర్చుటలో తన భర్త ఆమెకు ఎలా సహాయం చేశాడు?
7. వీరిద్దరిలో మనకు కన్పించే మంచి లక్షణాలు ఏంటి?
8. నిస్వార్థమైన తమ సేవకుగాను ఈ దంపతులు ఎలాంటి బహుమానం పొందారు?
9. క్రైస్తవ దంపతులుగా ఒకరికొకరం మనం సమయాన్ని ఏవిధంగా కేటాయించుకోగలము? తన భాగస్వామి తనకు తగినంత సమయం ఇవ్వకపోతే భార్యాభర్తల మధ్య ఐక్యతకు ఎలాంటి భంగం కలుగుతుంది?
10. స్త్రీలపై వివక్షత చూపించే కొన్ని సంస్కృతి, సాంప్రదాయాలను చర్చించండి. దేవుని యందు మన విశ్వాసం, దేవుని వాక్య పఠనం మన కుటుంబాలలో సమానత్వాన్ని, ఐక్యతను ఎలా పెంపొందిస్తాయి?

– రోశమ్మ మాథ్యూ, ఢిల్లీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేకం

# యుఇయస్ఐ - ఆణిముత్యాలు



**షిరిన్ తబిత ఇనాక్**

**శ్రీమతి షిరిన్ తబిత గారు** ప్రొ. ఇనాక్ గారి సతీమణి. ఎంతో వినయ మనస్కులు, ప్రేమ చూపించేవారు. ఆతిథ్యం ఇవ్వడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవారు. తన గృహములో ఆమె ఆతిథ్యం మూలంగా అనేకమంది విద్యార్థులు క్రీస్తు కోసం పట్టబడ్డారు.



**ఎలోయిస్ స్టైరెట్**

**శ్రీమతి ఎలోయిస్ స్టైరెట్ గారు** స్టైరెట్ గారి సతీమణి. వీరు విద్యార్థినీలను ప్రోత్సహించడంలో, వారిని ప్రభువు శిష్యులుగా తీర్చిదిద్దడంలో గొప్ప ప్రతిభావంతురాలు. త్యాగపూరితంగా ఇవ్వడం (హై ఫీల్డ్), క్రమశిక్షణ, ప్రేమించడం, నిజాయితీ, సేవా నాయకత్వం, బైబిల్‌ను ఖచ్చితంగా బోధించడానికి కట్టుబడి ఉండడం వీరి జీవితం నుండి మనం నేర్చుకోవచ్చు.



**డా. సరళా ఎలీషా**

**డా. సరళా ఎలీషా గారు** తమిళనాడులోని సియంసి వెల్లూరులో మెడిసిన్ చదివేటప్పుడు యస్‌సియం అనే ఆర్గనైజేషన్ వాక్యానికి వ్యతిరేఖంగా ఉందని గ్రహించి దాని నుంచి బయటకు వచ్చి డా. మూడిగారితో కలిసి ఇయు గ్రూప్‌ను ఏర్పాటు చేసిన వారిలో ఒకరు. మెడిసిన్ పూర్తయిన తర్వాత గుంటూరు కుగ్లర్ హాస్పిటల్‌లో పని చేయడానికి 1958వ సంవత్సరంలో వచ్చారు. శ్రీమతి రీటా డానియల్ మొదలైన వారితో ప్రార్థనాపూర్వకముగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఇయును ప్రారంభించారు. దేవుని కొరకు కమిట్‌మెంట్ కలిగి జీవిస్తూ, ఆర్థిక అవసరాలకు సంపూర్ణంగా దేవునిపై ఆధారపడుతూ, పేదలకు సహాయం చేస్తూ దేవుని పనిలో కొనసాగుతున్నారు.



**ప్రేమా ఫెన్**

**సిస్టర్ ప్రేమా ఫెన్ గారు** ప్రొఫెసర్ ఇనాక్ గారు, స్టైరెట్ గారి ద్వారా మెంటరింగ్ చేయబడ్డారు. యుఇయస్ఐ స్టాఫ్ వర్కర్‌గా 29 సంవత్సరాలు విద్యార్థినులకు సేవలందించారు. క్రమశిక్షణ, ప్రేమ, దేవునిపై ఆధారపడడం, నిజాయితీ వీరి జీవితం నుండి మనం నేర్చుకోవచ్చు.



**షెర్లీ క్రిష్టోఫర్**

**సిస్టర్ షెర్లీ క్రిష్టోఫర్ గారు** చెన్నైలో 26 సంవత్సరాలు యుఇయస్ఐ లేడీ స్టాఫ్‌గా పనిచేశారు. సిస్టర్. జీన్‌పామ్ క్విస్ట్ ద్వారా మెంటర్ చేయబడ్డారు. వీరు అద్భుతమైన బైబిల్ స్టడీ టీచర్, లీడర్, కౌన్సిలర్, పీపుల్ బిల్డర్. వీరు విద్యార్థినీలు, లేడీ గ్రాడ్యుయేట్స్‌తో సమయం గడపడానికి ఎంతో ఇష్టపడుతుంటారు. 'లెట్ ద బైబిల్ స్పీక్' అనే పుస్తక రచయితలలో వీరు ఒకరు.



**కమల కుమారి**

**సిస్టర్ కమల కుమారి గారు** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పరిచర్య చేశారు. ప్రార్థన, ప్రేమ, ప్రయాస, త్యాగపూరితంగా ఇవ్వడం, అందరితో కలిసి పోవడం, నిజాయితీగా ఉండడం వీరి జీవితం నుండి మనం నేర్చుకోవచ్చు.

*వీరందరూ యుఇయస్ఐ విద్యార్థినీల పరిచర్యలో మాదిరిగా ఉన్న విశ్వాస వనితలు!*

*మరి మన సంగతి ఏమిటి???*

**బాలికల పరిచర్య విభాగం, యుఇయస్ఐ-ఏపి**



# పరీక్షలకు సిద్ధమేనా?

"మనస్ఫూర్తిగా పని చేయలేని వారు జీవితంలో విజయాన్ని సాధించలేరు" అంటాడు మన మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలాం. పరీక్షలలో విజయం రాత్రికి రాత్రి రాదు. విజయానికి ఏడు మెట్లు లేదా విజయానికి మూడు మెట్లు చదివినంత మాత్రాన పరీక్షలలో విజయం సాధించలేము. నీ విజయం నీ సిద్ధపాటు మీద ఆధారపడి ఉంటుంది. ఫిలిప్పీ 4:13 ప్రకారం, "నన్ను బలపరచువానియందే నేను సమస్తము చేయగలను". అంటే మొదట దేవుని మీద ఆధారపడాలి. రెండవదిగా, సంవత్సరమంతా ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవాలి. మరి మీ సిద్ధపాటు ఎలా ఉంది? అనేక పోటీ పరీక్షలకు, అకడమిక్ పరీక్షలకు తేదీలను ఇప్పటికే ప్రకటించారు? అయితే ఈ పరీక్షలకు సిద్ధమేనా?

2023, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం ఒక్క 2022 సం॥లోనే 13 వేల మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. 2,000 మందికి పైగా పరీక్షల్లో ఫెయిల్ అయిపోతామేమో అని ఆత్మహత్యలు చేసుకొంటే, 2,095 మంది పరీక్షల్లో ఫెయిల్ అయిన తర్వాత ఆత్మహత్యలు చేసుకొన్నారు. కాబట్టి పరీక్షల సమయం లేదా సీజన్ అనగానే అటు తల్లిదండ్రులలోను ఇటు విద్యార్థులలోను ఆందోళన మొదలౌతుంది. కొంతమందికి నిద్రపట్టదు. కొంతమంది డిప్రెషన్‌లోకి వెళతారు. ఈ సమయంలోనే కాంపిటేటివ్ పరీక్షల నోటిఫికేషన్స్ వచ్చాయి. మార్చి అనగానే పరీక్షల సమయం. ఆత్మహత్యల సంఖ్య కూడా ఎక్కువశాతం పరీక్షలు సమయంలో, పరీక్షల ఫలితాలు వెల్లడించిన తర్వాత జరగడం గమనార్హం. వీటికి చాలా కారణాలున్నాయి. ప్రధానంగా భయం, ఒత్తిడి, ఆందోళన. ఇవన్నీ విద్యార్థుల్ని డిప్రెషన్‌లోనికి తీసుకువెళుతున్నాయి.

దేవుని కుమారులుగా, కుమార్తెలుగా, ఇయు విద్యార్థులుగా మన పరిస్థితి ఏంటి? వీటన్నింటిని అధిగమించి మనం ఎలా సిద్ధపడగలం? ఈ పరీక్షలలో విజయం ఎలా సాధించగలం?

### పరీక్షలు ఎందుకు?

దేవుడు పరీక్షలు ఎందుకు పెడతాడు? అనే సందేహం మనలో చాలామందికి ఉంటుంది. దేవుడు ఖచ్చితంగా పరీక్షలు పెడతాడు. ఎందుకంటే సువర్ణం అగ్నిలో లేదా కొలిమిలో కాల్చబడితేనే దాని మేలిమి బయటకు వస్తుంది. అలానే దేవుడు పరీక్షల ద్వారా మనల్ని, మన విశ్వాసాన్ని, లోబడే విధానాన్ని, మన నమ్మకత్వాన్ని తెలుసుకోవడానికి మనకు ఆత్మీయ పరీక్షలు పెడతాడు. అబ్రహాం పరీక్షించబడ్డాడు.

విశ్వాసులకు తండ్రిగా మార్చబడ్డాడు. యోబు పరీక్షించబడ్డాడు. అధికముగా ఆశీర్వదించబడ్డాడు. యోబు 42:12 ప్రకారం యెహోవా యోబును మొదట ఆశీర్వదించినంతకంటె మరి అధికముగా ఆశీర్వదించాడు. ఇశ్రాయేలీయులు పరీక్షింపబడ్డారు. ఆయన వారి జీవితంలో చేసిన ఎన్నో ఆశ్చర్య, అద్భుతకార్యాలు చూశారు కాని చాలా సందర్భాలలో ఆయనయందు విశ్వాసముంచలేదు, లోబడలేదు. కాబట్టి వాగ్దత్త భూమిలోనికి ప్రవేశించకుండానే ఆయన మీద గొణిగి, సణిగి అరణ్యంలో రాలిపోయారు. కాబట్టి పరీక్షలు ఉంటాయి, పరీక్షలకు ఫలితం కూడా ఉంటాయి.

## ఆత్మీయ పరీక్షలు, అకడమిక్ పరీక్షల లక్ష్యం ఏంటి?

ఆత్మీయ పరీక్షలు మన విశ్వాసాన్ని, నమ్మకత్వాన్ని దేవుని పట్ల మనకున్న ప్రేమను, శ్రమల్లో వెనుదిరగకుండా ఆయనను వెంబడించేటట్లు చేస్తాయి. కాబట్టి బైబిల్ గ్రంథం ఇలాంటి వారిని విశ్వాస వీరుల జాబితాలో చేర్చింది. ప్రభువు అప్పగించిన పనిని, పరిచర్యను చేసి ఆత్మీయ పరీక్షలలో విజయం సాధించి ప్రభువుతో భళా నమ్మకమైన మంచి దాసుడా, దాసురాలా అని అనిపించుకొన్నారు.

అకడమిక్ పరీక్షలు కళాశాలల్లో మన సామర్థ్యాన్ని తెలియజేసి, దేవునికి సాక్షులుగా నిలబెడతాయి. యేసుక్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించనప్పుడు ఇష్టానుసారంగా జీవించాం. కానీ ఇప్పుడు మనం దేవుని ప్రియమైన బిడ్డలం. ఆయన రక్తంలో కడగబడి, విమోచించబడినవారం. అంధకారంలో నుండి వెలుగులోకి పిలవబడినవారం. కాబట్టి ఇయు విద్యార్థులుగా ఇప్పుడు మనం ఏం చేసినా దేవుని మహిమకోసం చేయాలి. ఆయనకు సాక్షులు గా ఉండాలి. గతంలో రికార్డ్స్‌లో మార్కుల కొరకు డబ్బులిచ్చే వాళ్ళం. పరీక్షల్లో కాపీలు కొట్టేవాళ్ళం. కానీ దేవుని బిడ్డలంగా ఇప్పుడు లంచం ఇవ్వము, పరీక్షల్లో కాపీ కొట్టము. నిజాయితీగా దేవుని మీద ఆధారపడుతూ కష్టపడి చదువుతాం. జ్ఞానం కొదువుగా ఉంటే ఆయనను అడుగుతాం. ఎందుకంటే బుద్ధి, జ్ఞాన, సర్వసంపదలు ఆయన యందే గుప్తమైయున్నాయి. కాబట్టి చదువు అయినా, అకడమిక్ పరీక్షలు అయి నా, పోటీ పరీక్షలైనా మనుష్యుల్ని సంతోషపెట్టడానికి కాకుండా దేవునిని సంతోష పెట్టడానికి చదువుతాం, రాస్తాం. దేవుని మీద ఆధారపడుతూ కష్టపడి చదివినప్పుడు ఆయన నాకు తప్పకుండా సహాయం చేస్తాడనే నిరీక్షణ కలిగి ఉంటాం.

## పరీక్షల కొరకు ఎలా సిద్ధపడాలి?

పరీక్షల్ని బాధ్యతతో రాయాలే గాని భయంతో కాదు. ప్రతిది మనం దేవుని పిల్లలుగా ఆలోచించాలి, దేవుని పిల్లల వలె కష్టపడుతూ సిద్ధపడాలి. ప్రసంగి 9:10 ప్రకారం చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనియైనను నీ శక్తి లోపము లేకుండా చేయుము.

1. స్టడీని ప్లాన్ చేసుకోవాలి. నీ పరీక్షలు ఎన్ని రోజులు ఉన్నాయో చూసుకొని ఒక ప్రణాళిక వేసుకోవాలి. సబ్జెక్ట్ వైజ్ టైంటేబుల్ సిద్ధపరచుకోవాలి.
2. నీ సిద్ధపాటు సంవత్సరం/సెమిస్టర్ ప్రారంభం నుండే ఉందా? లేదా ఇప్పుడే ప్రారంభిస్తున్నావా? ఒక్కసారి సరిచూసుకోవాలి. సిద్ధపాటు రెగ్యులర్‌గా ఉండాలి.
3. ఇప్పటికే కనీసం సిలబస్ అంతా ఒక్కసారైనా చదివి, రివిజన్ ప్రారంభించాలి. మొదటిసారి క్షుణ్ణంగా చదవాలి. రెండవ రివిజన్ రెండు నెలలో పూర్తి చేసి షార్ట్‌కర్ట్స్ లాగా నోట్సు రాసుకోవాలి. చివరి 15 రోజుల ముందు మూడవ రివిజన్ చేయాలి. మూడవ రివిజన్ చేసేటప్పుడు షార్ట్‌కర్ట్స్‌గా ప్రిపేర్ చేసుకొన్న నోట్స్ చదవాలి.
4. ఎక్కువసార్లు చదవడం వలన లాంగ్‌టర్మ్ మెమరీలో ఉంటుంది. గుర్తుండి పోతుంది. పరీక్షలలో అద్భుతంగా రాయగలగుతారు.
5. హోవార్డు గార్డెనర్ మల్టిపుల్ ఇంటలిజెన్స్ థియరీని ప్రతిపాదించాడు. అతని ప్రకారం నేర్చుకొనేవారు 4 విధాలుగా ఉంటారు.
   అ. చూసి నేర్చుకొనేవారు
   ఆ. విని నేర్చుకొనేవారు
   ఇ. రాసిన లేదా మాట్లాడిన పదాలు లేదా వాక్యాల ద్వారా నేర్చుకొనేవారు
   ఈ. కైనస్తటిక్ ద్వారా అంటే ఫిజికల్ యాక్టివిటీ ద్వారా

   వీటిలో మీరు ఏ కోవకు చెందుతారు. లేదా మిక్స్‌డ్‌గా నేర్చుకొంటారా? ఇవి కాకపోయినా వేరే పద్ధతిలోనైనా నేర్చుకొంటారా? కాబట్టి మీ

సిద్ధపాటులో మీరు దేనినైనా ప్రయోగించవచ్చు. ఇవే కాకుండా వివిధ రకాలైన లెర్నింగ్ టెక్నిక్స్‌ని మీ సిద్ధపాటులో వాడుకోవచ్చు.

6. ఇవన్నీ ఎందుకు అంటే చదివిన దానిని గుర్తుంచుకోవడానికి ప్రయత్నించకపోతే 24 గంటలు తిరగకముందే దానిలో 70% మార్చిపోతాం.

7. సమయాన్ని చాలా ఎఫెక్టివ్‌గా ఉపయోగించుకోవాలి.

   సామెతలు 6:6 ప్రకారం సోమరీ చీమల యొద్దకు వెళ్ళుము. వాటి నడతలు కనిపెట్టి జ్ఞానమును తెచ్చుకొనుము. వాటికి ప్రణాళిక ఉంది, ఏ సమయంలో ఆహారం సమకూర్చుకోవాలో వాటికి తెలుసు. కష్టపడతాయి, పట్టుదల కలిగి ఉంటాయి. మరి మన సంగతి?

8. ఎప్పుడు చదివితే ఎంత గుర్తుంటుంది (ఒక సర్వే ప్రకారం)

   సాయంత్రం 4-7 వరకు - 40%
   రాత్రి 7-10 వరకు - 80%
   రాత్రి 10-12 వరకు - 60%
   రాత్రి 12- ఉదయం 5 వరకు - 20%
   ఉదయం 5-9 వరకు - 100%
   ఉదయం 9-1 వరకు - 60%
   మధ్యాహ్నం 1-4 వరకు - 20%

9. ప్రీవియస్ క్వశ్చన్ పేపర్స్‌ని చదివి ప్రాక్టీస్ చేయాలి.

10. ఒక ప్రత్యేకమైన స్థలంలో కూర్చొని చదవాలి. అక్కడ ఎలాంటి డిస్ట్రర్బెన్స్ ఉండకూడదు. నీవు చదివే ప్లేస్‌లోనే నీకు కావలసినవన్ని పెట్టుకోవాలి. వాటి కోసం పదేపదే అటు ఇటూ తిరుగుతూ సమయం వృధా చేసుకోకూడదు.

11. చదివేటప్పుడు ప్రతి గంటకు 5-10 నిమిషాల పాటు రెస్ట్ బ్రేక్స్ ఇవ్వాలి.

12. కష్టపడి చదవాలి. కష్టపడే వారిని దేవుడు ఖచ్చితంగా దీవిస్తాడు (సామె 10:4-5).

## పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1. మంచి ఆహారం తీసుకోవాలి. ఆహారంలో ప్రొటీన్, ఫైబర్, ఫ్రూట్స్ ఉండేటట్లు చూసుకోవాలి.

2. నైట్‌అవుట్స్ చేయకూడదు. నీకు 20% గుర్తుంటుంది. నీ బాడీ మెటబాలిజం దెబ్బ తింటుంది.

3. 6-8 గంటలు ఖచ్చితంగా నిద్రపోవాలి. నిద్రలేమి అనేక రోగాలకు కారణం.

4. ఈ మధ్య ఎక్కువగా మనం వినే మాటలు, జడ్ జనరేషన్, డిజిటల్ జనరేషన్, ఐపాడ్ జనరేషన్ అంటే మనము స్మార్ట్‌ఫోన్ లేకుండా బ్రతకలేము, జీవించలేము. కాని మనం దేవుని బిడ్డలంగా ఈ పరీక్షల సమయంలో సెంట్‌పర్సెంట్ ఫోన్ ప్రక్కన పెట్టడం మంచిది.

5. కొంత సమయం ఫిజికల్ ఎక్సర్‌సైజ్‌కు కేటాయించాలి.

6. ఒకవేళ ఆందోళన, భయం, డిప్రెషన్, ఒత్తిడి అనిపిస్తే ప్రార్థన చేసుకోవాలి. వెంటనే మన గ్రాడ్యుయేట్ అన్నవాళ్ళని, అక్కవాళ్ళని కలవాలి. వారి దగ్గర కౌన్సిలింగ్ తీసుకోవాలి.

7. ఎట్టి పరిస్థితుల్లో క్వయిట్ టైమ్, వ్యక్తిగత ప్రార్థనను అశ్రద్ధ చేయకూడదు.

## ముగింపు

ప్రియ తమ్ముడూ, చెల్లీ మీరు దేవుని దృష్టిలో చాలా ప్రత్యేకమైనవారు. తల్లిదండ్రులకు దూరంగా, హాస్టల్స్‌లో లేక రూమ్స్‌లో ఉండి పోటీ పరీక్షలకు లేదా ఇయర్/సెమిస్టర్ ఎండింగ్ పరీక్షలకు నీవు సిద్ధపడుతూ ఉంటే నీ దృష్టి దేవునిపై ఉంచు, ప్రభువు నామ మహిమార్థమై సిద్ధపడు. ఒకవేళ ఇప్పటివరకు అశ్రద్ధ చేస్తే ప్రభువుని క్షమాపణ అడుగు. దానియేలు, షద్రక్, మేషక్, అబెద్నెగోల వలె నమ్మకంగా ఉండి, కష్టపడటానికి ఇష్టపడితే దేవుడు పదింతల శ్రేష్టంగా ఉంచడానికి ఆయన ఇష్టపడుతున్నాడు. యెహోషువ 1:9 ప్రకారం "నేను నీకు ఆజ్ఞ ఇచ్చియున్నాను గదా, నిబ్బరము కలిగి ధైర్యముగా ఉండుము. దిగులుపడకుము, జడియకుము; నీవు నడచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును". దేవుడు నీకు తోడుగా ఉంటానని వాగ్దానం చేస్తున్నాడు. మరి నీవు మనస్ఫూర్తిగా భయం లేకుండా బాధ్యతతో యేసయ్య నామమహిమార్థమై సాక్షిగా ఉండడానికి పరీక్షలకు సిద్ధమేనా!

**- డా. యం. సాల్మన్ రాజు,** వైజాగ్



## శుభ శుక్రవారంలోని
# శుభం ఏంటి?

మానవ చరిత్రలో 2023 సంవత్సరాల క్రితం నజరేతువాడైన యేసుక్రీస్తు ఒక శుక్రవారం సిలువ మీద మరణించాడు. ఆ శుక్రవారాన్ని శుభ శుక్రవారం అంటారు. సాధారణంగా కొంతమంది మరణాన్ని అశుభంగా భావిస్తారు. యేసుక్రీస్తు మరణానికి ముందు, తరువాత కూడా ఎందరో గొప్ప వ్యక్తులు మరణించారు గదా! అయితే యేసుక్రీస్తు మరణాన్నే ఎందుకు శుభదినంగా పరిగణిస్తున్నారు? ఇంకా చెప్పాలంటే యేసు పొందిన సిలువ మరణం నేరస్తులకు, క్రూరమైన వారికి విధించే మరణశిక్ష. దీనిని చాలా అవమానకరమైన రీతిలో వేసేవారు. యేసు మరణించిన ఈ శుభశుక్రవారం ఏ రకంగా శుభము? ఎవరికి శుభము? అనేది తెలుసుకొందాం.

### సిలువ మరణం ఎలా ఉంటుంది?

మొట్టమొదటిగా అతి క్రూరమైన సిలువ మరణ శిక్షను బార్బేరియన్లు కనిపెట్టారు. తర్వాత రోమీయులు, గ్రీకులు కూడా భయంకరమైన, ఘోరమైన నేరస్తులకు ఈ మరణశిక్షను వేయడం మొదలుపెట్టారు. నేరం చేసి రుజువైన నేరస్తుడిని బాహాటంగా బట్టలూడదీసి, చిన్నతుండు మొలకు కట్టి, అందరూ చూసి భయపడేటట్లు ఒక ఎత్తైన స్థలంలో అడ్డు, నిలువుగా ఉన్న మాను మీద అతని రెండు చేతులకు, కాళ్ళకు మేకులు కొట్టి, ఒక గొయ్యి తవ్వించి అందులో ఆ నేరస్తుని కొట్టిన సిలువ చెక్కను గోతిలో దబ్బున కుదేస్తారు. ఆ నేరస్తుడు రోజుల తరబడి వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ ఆ సిలువ మీద వేలాడుతూ అరుస్తూ ఉంటాడు. పక్షులు కూడా పొడుస్తుండవచ్చు. అలా వేలాడుతూ చివరికి ఊపిరాడక చనిపోతాడు. ఒకవేళ సబ్బాతు దినం వచ్చే ముందు చావకపోతే అతని కాళ్ళను విరగ్గొడతారు. అప్పుడు ఊపిరాడక చనిపోతాడు.

### యేసుక్రీస్తు సిలువ మరణం

యేసుక్రీస్తు కూడా నేరస్తునిలా ఈ క్రూరమైన సిలువ శిక్షకు గురయ్యాడు. ప్రత్యక్షసాక్షులైన సువార్త రచయితలు రాసినట్లుగా యేసుప్రభువును సిలువ మరణానికి ముందు రోజు రాత్రి అరెస్ట్ చేసి ప్రధాన యాజకుడైన కయప దగ్గరకు ఈడ్చుకెళ్ళారు. అక్కడ నుండి రోమా గవర్నరైన పిలాతు దగ్గర విచారణకు తీసుకొనివెళ్తే ఆయన హేరోదు దగ్గరకు పంపించాడు. హేరోదు చాలా ప్రశ్నలు వేసి అపహసించి అన్యాయముగా నేరాన్ని మోపి మరలా పిలాతు నొద్దకు పంపించేశాడు. అక్కడ విచారణ చేసిన తరువాత సిలువ వెయ్యమని వెలుపల కేకలు వేస్తున్న యూదుల దగ్గరకెళ్ళి పిలాతు 'ఈయనలో ఏ దోషము లేదని స్పష్టం చేశాడు'.

పిలాతు యేసును విడిపించే మొదటి ప్రయత్నంలో యూదులు పస్కా పండుగ సందర్భంగా ఒక నేరస్తుడిని విడుదల చేయడం ఆనవాయితీ కాబట్టి యేసును విడుదల చేద్దామంటే ప్రజలు ఒప్పుకోకపోగా బరబ్బ అనే బందిపోటు దొంగను విడుదల చేయమన్నారు. రెండవ ప్రయత్నంగా కొరడా దెబ్బలు కొట్టించడం ద్వారా వాళ్ళ అహం సంతృప్తి చెందుతుంది అనుకొని మరలా ఆయనలో దోషం లేదని చెప్పాడు.

కానీ సిలువ వెయ్యమన్న సమూహపు కేకలే గెలిచాయి. అంటే ఒక వ్యక్తిని నిర్దోషి అని తీర్పుతీర్చి, మరణ శిక్ష విధించడం అనేది ఏ న్యాయవ్యవస్థలో ఎన్నడూ జరగనిది. న్యాయపరంగా ఏ నేరము లేదని, యేసు నిర్దోషని నిరూపిస్తూనే శిక్షకు అప్పగించాడు. ఇది అన్యాయపు తీర్పు. చివరకు పిలాతు చేతులు కడుక్కొని ఈ నీతిమంతుని సిలువ శిక్ష వెయ్యడానికి వారికి అప్పగించాడు. అప్పుడు సిలువను మోయించి కపాలమనబడిన ఎత్తైన స్థలంలో ఇద్దరు నేరస్తులతోపాటు యేసుప్రభువును సిలువ వేశారు. సిలువలో వేలాడుతూ చివరిగా 'సమాప్తమైనది' అనే మాటను పలికి తండ్రికి తన ప్రాణాన్ని అప్పగిస్తూ ప్రాణాన్ని విడిచాడు. ఆయన

మరణాన్ని నిర్ధారించడానికి ప్రక్కలో బల్లెంతో పొడిచారు. కానీ ఇరుపక్కలా వేలాడుతున్న నేరస్తులకు మాత్రమే కాళ్ళు విరగగొట్టారు. ప్రభువు కాళ్ళు విరుగగొట్టాల్సిన అవసరం రాలేదు. ఎందుకంటే ఆయన నిస్సందేహంగా మరణించాడని రోమా సైనికులు నిర్ధారించుకొన్నారు.

**శుభవార్తకు కారణాలు**

మొదటిగా మానవుని యొక్క పాపం సృష్టికర్త, పరిశుద్ధుడైన దేవుని కోపాన్ని రేపి, ఆయన ఉగ్రతను మన మీదకి తెచ్చింది. దేవుని ఉగ్రత చల్లారడానికి పాతనిబంధన కాలంలో దేవుడు మోషేద్వారా సెలవిచ్చినట్లుగా ఏటేటా బలులు అర్పించి, శాంతింప చేసేవారు. కానీ అవి దేవుని ఉగ్రతకు కారణమైన పాపాన్ని గానీ, పాపపు గిలిని తొలగించలేకపోయింది. కావున యేసుక్రీస్తు మానవునిగా జన్మపాపము లేనివానిగా జన్మించి, పాపము లేనివానిగా జీవించి, దేవుని నీతిని నెరవేర్చి దేవుని ఉగ్రతను మరియు ఉగ్రతకు కారణమైన పాపాన్ని తొలగించుటకు సిలువలో పవిత్ర రక్తాన్ని చిందించారు (రోమా 3:24-25). కావున సకలమానవాళి పాపానికి, ఒక్కసారే బలియై, శాశ్వతముగా పాపమును తొలగించి దేవుని శాంతింపచేయుట వలన మన పాపం కొరకు శాంతికరమై యున్నాడు. దీన్ని 'శాంతి కుదర్చుటము' అన్నారు (1 యోహాను 2:1-2).


రెండవదిగా, మనం పాపం చేసి, ఆ పాపానికి దాసులమై, ఈ పాపదాస్యం నుండి ఎవరు విడిపిస్తారా అని సార్వత్రికమైన ప్రార్థన చేస్తున్నాము కదా! మనల ను మనం విమోచించుకోలేని అశక్తత మరియు విమోచన అవసరతను బట్టి, మనలను పాపం నుండి విడిపించడానికి పరిశుద్ధుడైన యేసుక్రీస్తు సిలువ రక్తం, విమోచన క్రయధనంగా చెల్లించబడింది. దాన్ని 'విమోచన' అన్నారు (1 పేతురు 1:18-19).

మూడవదిగా న్యాయవంతుడు, తీర్పరియైన దేవుని న్యాయం ముందు పాపం చేసిన మనమందరం దోషులంగా నిలబడ్డాం. అపరాధభావంతో దాని కప్పిపుచ్చుకోవడానికి ఎన్నో పుణ్యకార్యాలు చేస్తు న్నాము. అయితే అవేవీ నా పాపానికి రావాల్సిన మరణశిక్షకు ప్రత్యామ్నాయం కాదు. కాబట్టి ఈ మంచి శుక్రవారం నాడు నా మరణశిక్ష ఆయన మీద వేసుకోవడం ద్వారా నాకు శుభం జరిగింది. యేసు సిలువ మరణానికి కొన్ని గంటల ముందు ఒక ప్రఖ్యాతిగాంచిన నేరస్థుడైన బరబ్బ జైలు తలుపులు తట్టి, 'బరబ్బ నీకు శుభవార్త' అన్నారు. బరబ్బకు ఆశ్చర్యం! ఎందుకంటే రేపోమాపో రోమా ప్రభుత్వం విధించిన సిలువ మరణం యొక్క విచారణ కొరకు ఎదురుచూస్తున్నాడు. బ్రతికే అవకాశంలేని నేరస్తుడికి తన చావును వేరే నీతిమంతుడు తీసుకోవడం ఆ బరబ్బకు శుభం కాదా? మనమందరం నేరస్తులం. మన నేరాన్ని యేసుప్రభువు ఆయన మీద వేసుకొని సిలువలో మరణించడం మనకు శుభం కాదా? దేవునితో ఎలైన్‌మెంట్ చేశాడు. అస్తవ్యస్త జీవితాన్ని క్షమించాడు. దాన్ని 'నీతిమంతునిగా తీర్చడం' అన్నారు (రోమా 3:24).

నాల్గవదిగా దేవుని సంతానంగా ఉన్న మానవులు పాపం చెయ్యడం ద్వారా తండ్రియైన దేవునితో వైరం ఏర్పడింది. మొదటి మానవులైన ఆదాము హవ్వలు దేవుని అధికారాన్ని సవాలు చేసినట్లు ఆజ్ఞను అతిక్రమించి పాపం చేశారు. తద్వారా దేవునితో, తోటి మనిషితో సంబంధాలు చెడిపోయాయి. చెడిపోయిన ఈ సంబంధాలను తిరిగి పునర్నిర్మించడానికి ఆయన సిలువ మరణం ద్వారా సంధి చేసి సమాధానాన్ని కుదిర్చాడు. మన సమాధానార్థమైన శిక్ష ఆయన మీద పడింది. బలియైనవాడు ఈ వైరాన్ని తొలగించాడు. దీన్ని 'సమాధానపరచబడటం' అంటారు (రోమా 5:9-11).

ఈ రీతిగా యేసయ్య మరణం మానవులందరికీ వారి పాపాల నుండి రక్షణను కలిగించిన మరణం, అంటే దేవుని ఉగ్రత నుంచి రక్షించి దేవుని కోపాన్ని, కోపానికి కారణమైన పాపాన్ని తొలగించిన మరణం. సమస్త మానవ పాపానికి యేసు మరణం శాంతికరం. అది ఎంతో శుభమును చేసిన సిలువ మరణం. అందుకే అది శుభ శుక్రవారము. అంతమాత్రమే కాదు, పాపాన్ని క్షమించి శిక్ష నుండి రక్షించడం మాత్రమే గాక పాపిని నీతిమంతునిగా నిలువబెట్టిన మరణమది. పాపపు చెర నుండి, సాతాను బంధకాల నుంచి విమోచించిన మరణమది. పాపము వల్ల దేవునితో ఏర్పడిన వైరాన్ని తొలగించి సమాధానపరచి తెగిపోయిన బంధాన్ని తిరిగి ఏర్పరచి దేవుని పిల్లలు గా ఉండే అధికారాన్ని ఇచ్చిన మరణమది. ఇలాంటి యేసయ్య మరణం గొప్ప శుభానికి పునాది.

**– బి. రంగనాథం,** వైజాగ్



ప్రత్యేకం

# సమాధికి అవతల ఉన్న నిరీక్షణ


తాను ఎవరు అని యేసుక్రీస్తు ప్రభువు చెప్పుకొన్నారో దానికి చిహ్నం, శిఖరాగ్ర నిదర్శనమే ఆయన పునరుత్థానం. "పునరుత్థానమును, జీవమును నేనే" (యోహాను 11:25).

మన నూతన జీవితం, సమృద్ధియైన జీవితం, నిత్యజీవం అనేవి మరణాన్ని జయించి తిరిగి లేచిన ప్రభువుతో, ఆయనతో మనకు కలిగిన ఐక్యతతో ముడిపడి ఉన్నాయి. ఆయన అసాధారణ జన్మ, పవిత్రమైన జీవితం, పాపుల ప్రతినిధిగా ఆయన పొందిన మరణం, జయప్రదమైన ఆయన పునరుత్థానం, తీర్పు తీర్చడానికి రాబోతున్న ఆయన రెండవ రాకడ ఆయన ఎవరో అనే విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. అయితే, ఆయన పునరుత్థానం ఆయన మొదటి రాకడలోని విషయాలన్నిటినీ ధృవీకరిస్తుంది. "మరియు క్రీస్తు లేపబడియుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే, మీ విశ్వాసమును వ్యర్థమే" (1 కొరింథీ 15:14).

యేసుక్రీస్తు పునరుత్థానం గూర్చి పాత నిబంధనలో ప్రవచించబడింది (లేఖనముల ప్రకారం మూడవ దినమున లేపబడెను 1 కొరింథీ 15:4), సువార్తలలో నిరూపించబడింది, పత్రికలలో వర్ణించబడింది, అపొస్తలుల కార్యముల గ్రంథంలోని అపొస్తలుల బోధలలో అది ప్రధానాంశం అయ్యింది (అపొ. కా. 2:31; 4:2; 17:32). ప్రకటన గ్రంథంలో తెలియజేయబడిన విధంగా త్వరలో సంభవించే సార్వభౌముడైన ప్రభువు రెండవ రాకడతో ఇది ముగుస్తుంది.

యేసుక్రీస్తు పునరుత్థానం లాజరు మరియు మొదలగువారు పొందిన పునరుజ్జీవం, అంటే ప్రాణం తిరిగి రావడం లాంటిది కాదు. బలహీనత, ముసలితనం, మరణానికి గురవ్వని, నిత్యత్వానికి చేరడానికి అనువుగా ఉండే ఒక నూతనమైన జీవితం కలిగిన శరీరం అది. ఈ లోక సంబంధమైన, బలహీనత, అగౌరవం, మరణం కలిగిన శరీరం శక్తితో, గౌరవం కలిగిన, ఆత్మీయ శరీరంగా మార్చబడింది. "శరీరము క్షయమైనదిగా విత్తబడి అక్షయమైనదిగా లేపబడును" (1 కొరింథీ 15:42-44).

యేసుక్రీస్తు పునరుత్థాన శరీరం తాకడానికి అనువుగా ఉన్న శరీరం. ఆయన ఆత్మ స్వరూపంలో పునరుత్థానం చెందలేదు. "వారు ఆయన యొద్దకు వచ్చి, ఆయన పాదములు పట్టుకొని ఆయనకు మ్రొక్కిరి" (మత్తయి 28:9). కాల్చబడిన ఒక చేపను ఆయన తిన్నారు (లూకా 24:41). తోమాకు తన చేతి గాయాలను, ప్రక్కలోని గాయాన్ని చూపించారు (యోహాను 20:27). విశ్వాసంలో వెనుకకు జారిపోయిన తన శిష్యులకోసం ఆహారాన్ని సిద్ధపరిచారు



(యోహాను 21:12-13). అయినప్పటికీ, భౌతిక ఉనికికి సంబంధించిన సాధారణ నియమాలకు అతీతంగా పునరుత్థానుడైన యేసు యొక్క శరీరం ఉన్నది. భౌతిక, ప్రాదేశిక పరిమితులకు ఆయన అతీతునిగా ఉన్నాడు. యేసుక్రీస్తు భౌతిక పునరుత్థానం, నిత్యత్వ సంబంధమైన ఆయన పునరుత్థాన శరీరం అనేవి దేవుడు మొదట సృజించిన భౌతిక సృష్టి యొక్క గొప్పతనానికి స్పష్టమైన రుజువుగా ఉన్నది. "దేవుడు తాను చేసినది యావత్తును చూచినప్పుడు అది చాలా మంచిదిగానుండెను" (ఆది 1:31). నీతి నివసించే నూతన భూమ్యాకాశములలో పునరుత్థానం చెందిన ప్రజలంగా మనం నిత్యమూ జీవిస్తాము.

## పునరుత్థానం - వేదాంత, అభ్యసనాత్మక అర్థాలు

### 1. పునరుత్థానుడైన క్రీస్తు క్రైస్తవ జీవితం కోసం, పరిచర్య కోసం మనల్ని శక్తితో నింపుతాడు

క్రీస్తును మృతులలో నుంచి లేపడానికి దేవుడు వినియోగించిన బలాతిశయమును మనం తెలుసుకోవాలని అపొస్తలుడైన పౌలు ప్రార్థించాడు (ఎఫెసీ 2:7). దేవుడు మనలను క్రీస్తుతో కూడా బతికించి, ఆయనతో కూడా లేపి పరలోకమందు ఆయనతో కూడా కూర్చుండబెట్టాడు. శిష్యులు పరిచర్యను ప్రారంభించబోతున్న సమయంలో పునరుత్థానుడైన క్రీస్తు తన శక్తి, సన్నిధి వారికి తోడుగా ఉంటుందని వాగ్దానం చేశాడు. తనకొరకు సాక్షులుగా ఉండడానికి అవసరమైన శక్తిని ఇస్తానని తన పునరుత్థానం తర్వాతనే ప్రభువు వారికి వాగ్దానం చేశాడు (అపొ. కా. 1:8).

### 2. క్రైస్తవ విశ్వాసం సత్యమైనదే అని క్రీస్తు పునరుత్థానం రూఢీ పరుస్తుంది

"క్రీస్తు లేపబడని యెడల మీ విశ్వాసము వ్యర్థమే" (1 కొరింథీ 15:17). "ఈ జీవిత కాలము మట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించువారమైన యెడల మనుష్యులందరి కంటే దౌర్భాగ్యులమై యుందుము" (1 కొరింథీ 15:19). అనేకమంది అనేక విషయాలపట్ల విశ్వాసాన్ని కనబరుస్తారు. అయితే అవి అస్థిరమైనవి, అశాశ్వతమైనవి, కొద్దికాలం మాత్రమే ఉండేవి. అయితే, క్రైస్తవుల మైన మనం నిత్యమైన విషయాలను బట్టి క్రీస్తునందు విశ్వాసముంచుతున్నాము (కొలస్సీ 3:1,2)

### 3. క్రీస్తు పునరుత్థానం మన నీతికి ఆధారమై ఉన్నది

"మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను" (రోమా 4:25). క్రీస్తు మనకోసం సిలువలో చెల్లించిన దానిని, ఆయనను మరణం నుండి లేపుట ద్వారా దేవుడు అంగీకరించిన యెడల మనకు ఎలాంటి శిక్ష లేదు. మన శిక్ష అంతటినీ క్రీస్తు సిలువలో భరించాడు. దేవుడు క్రీస్తును నీతిమంతుడని ప్రకటించి, ఆమోదించినందున మనం క్రీస్తుతో ఐక్యమయ్యాం కాబట్టి, మనల్ని కూడా నీతిమంతులుగా ప్రకటించి ఆమోదించినట్లే.

### 4. దు:ఖంలో సంతోషం

"చెప్పనశక్యమును మహిమాయుక్తమునైన సంతోషము గలవారై ఆనందించుచున్నారు" (1పేతురు 1:9). శ్రమలగుండా వెళ్తూ దు:ఖాన్ని, బాధను అనుభవిస్తున్న క్రైస్తవులను ఉద్దేశిస్తూ, క్రైస్తవులమైన మనం ఆనందంతో నింపబడి ఉన్నామని, పరిస్థితుల పై ఆధారపడే సంతోషంతో మనం నింపబడలేదని తెలియజేశాడు. పునరుత్థానుడైన ప్రభువు ఇచ్చే ఆనందమే మన బలం. పునరుత్థానుడైన క్రీస్తును చూసి శిష్యులు మహా ఆనందాన్ని పొందారు (మత్తయి 28:8).

### 5. క్రీస్తు పునరుత్థానం మన నిరీక్షణను పెంపొందిస్తుంది

బ్యాంక్ బ్యాలెన్స్, పదోన్నతి ...మొదలగు వాటికోసం మాత్రమే నిరీక్షణ ఉంచక, మరణం ఓడించబడిందని, మృతులలో నుండి వచ్చిన మొదటి ఫలం క్రీస్తు అని క్రైస్తవ విశ్వాసం నిరీక్షిస్తుంది. "దేవుడు ప్రభువును లేపెను, మనలను కూడా తన శక్తితో లేపుతాడు" (1 కొరింథీ 6:14). పునరుత్థానుడైన,

పరలోకానికి వెళ్ళిన యేసుక్రీస్తు మనకోసం ఒక స్థలాన్ని సిద్ధపరుస్తున్నాడు. ఆయన మరలా వచ్చి తనతో ఉండడానికి మనల్ని తీసుకొనివెళ్తాడు. క్రీస్తు ప్రభువు పునరుత్థానం ద్వారా దేవుడు మనకు "జీవము గల నిరీక్షణను" అనుగ్రహించాడు (1పేతురు 1:3,4).

### 6. శ్రమల్లో ఆదరణ

"ఆకాశమండలము గుండా వెళ్ళిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయం కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:14-16). ఆయన సమస్తమైన ఆదరణను అనుగ్రహించే దేవుడు, కాబట్టి ఆయన సహాయం కోసం ఆయన సన్నిధిని వెదుకుదాం. క్రీస్తు ప్రభువు తన మానవత్వాన్ని తన దైవత్వంలోకి తీసుకెళ్ళినందున, ప్రార్థన ద్వారా ధైర్యంతో ఆయనను మనం సమీపించవచ్చు. ఆయన మన బలహీనతలను అర్థం చేసుకొని, వాటిని అధిగమించడానికి మనకు శక్తిని ఇస్తాడు.

### 7. పునరుత్థానుడైన క్రీస్తు మన ఆరాధనకు అర్హుడు

తన పునరుత్థానం ద్వారా దేవుని కుమారుడనని ఆయన నిరూపించాడు (రోమా 1:4). యేసుక్రీస్తు యొక్క నిత్యత్వాన్ని, దైవత్వాన్ని ఆయన పునరుత్థానం నిరూపించింది. కాబట్టి, ఆయన మన ఆరాధనకు యోగ్యుడు. తోమావలె మనమందరం "నా ప్రభువా, నా దేవా" (యోహాను 20:28) అని ఆరాధించాలి. "వారు ఆయనకు నమస్కారం చేసిరి" (లూకా 24:52). పునరుత్థానుడై పరలోకానికి వెళ్ళిన క్రీస్తును ఇప్పుడు పరలోకంలో దేవదూతలు పాటలతో స్తుతిస్తున్నారు. "వధింపబడిన గొఱ్ఱెపిల్ల, శక్తియు ఐశ్వర్యమును జ్ఞానమును బలమును ఘనతయు మహిమయు స్తోత్రమును పొందనర్హుడని గొప్ప స్వరముతో చెప్పుచుండిరి" (ప్రక 5:12). తమ యెదుట పరలోకానికి వెళ్తున్న పునరుత్థానుడైన క్రీస్తు ప్రభువును శిష్యులు ఆరాధించారు (లూకా 24:52).


### క్రీస్తు పునరుత్థానం -మన ప్రతిస్పందన

1. ఆయన పునరుత్థాన శక్తి ద్వారా విజయవంతమైన జీవితాన్ని జీవించడానికి మనం పిలవబడ్డాము (రోమా 6:11-32).



2. మనం ఆయనతో ఎడతెగక సహవాసం చేస్తూ, ఆయన మహిమార్థం గొప్పగా ఫలించాలి (యోహాను 15:1-15)
3. ప్రపంచంలోని వివిధ సంస్కృతులు ఉన్న ప్రజల వద్దకు వెళ్ళి వారిని శిష్యులుగా చేయాలని పునరుత్థానుడైన క్రీస్తు మనల్ని ఆజ్ఞాపించాడు (మత్తయి 28:19). అర్థవంతంగా ఆయన పరిచర్యలో పాల్గొంటూ, ఆయన పనిలో సమృద్ధిగా ఫలించడానికి మనం పిలవబడ్డాము.
4. పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నప్పటికీ ప్రభువు మీదనే మనం నిరీక్షణ ఉంచాలి.
5. మన దృష్టి, ఆప్యాయత అంతా యేసుక్రీస్తు మీదనే ఉంచాలి. సుళువుగా చిక్కులు పెట్టే పాపాలలో చిక్కుకోకుండా జాగ్రత్తపడాలి (హెబ్రీ 12:1-2).
6. ఆయన న్యాయపీఠం ఎదుట నిలబడి, లెక్క అప్పగించాల్సిన సమయం కోసం, ఆయన రాకడ కోసం ఎదురు చూస్తుండాలి (2 కొరింథీ 5:10).
7. మరనాత అని మనం ప్రార్థిస్తూ, ఆయన రాకడ ద్వారా కలిగే సంపూర్ణ విమోచన కొరకు ఎదురు చూస్తూ నూతన భూమి నూతన ఆకాశంలో భూలోకంలో ఉన్న అన్ని జాతుల ప్రజలు ఆయన సింహాసనం ముందు నిలబడి ఆయనను ఆరాధించే రోజు కొరకు ఎదురు చూడాలి. పాపం పూర్తిగా తీసివేయబడుతుంది. సాతాను నిత్యనరకంలో పడదోయబడతాడు. నీతి నిరంతరము రాజ్యమేలుతుంది.

**- ఆరోన్ రజనీకాంత్,** హైదరాబాద్



కథానిక

# చెవులు గలవాడు వినును గాక!

అది 2019వ సంవత్సరం. అమలాపురంలో గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్స్ కాన్ఫరెన్స్ జరుగుతుంది.

'హాయ్ తమ్ముడూ బాగున్నావా?'

'హాయ్ అక్క బాగానే ఉన్నాను. మీరెలా ఉన్నారు? అన్న ఎలా ఉన్నారు? ఆరోగ్యం ఎలా ఉంది? పిల్లలు ఎలా ఉన్నారు? ఫ్యామిలీగా వచ్చారా? అంతా క్షేమమే గదా! అంటూ ఎక్కడ చూసినా ఒకరినొకరు పలకరించుకొంటూ పరవశించిపోతున్న సమయంలో 'గోదావరి గ్రాడ్యుయేట్స్ కాన్ఫరెన్స్ని ప్రార్థన చేసుకొని ప్రారంభించుకొందాం' అని మైక్‌లో వినిపించగానే అందరూ మీటింగ్ హాల్‌కి చేరుకొన్నారు.

ప్రార్థన చేసిన అనంతరం క్వైయర్ వారు అద్భుతంగా పాటలు పాడుతున్నారు. కాన్ఫరెన్స్ హాలు మధ్య వరుసలో కూర్చున్న వినయ్ తన మనసులో "దేవా ఈ కాన్ఫరెన్స్ ద్వారా నాతో మాట్లాడండి. మీ మాట ప్రకారం నడుచుకోవడానికి నాకు సహాయం చేయండి, కృపనివ్వండి" అంటూ ప్రార్థన చేసుకున్నాడు.

వినయ్ డిగ్రీ పూర్తి చేసి చిన్న కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. తన చదువులో పీజీ లేని కారణంగా జీతం కూడా తక్కువగానే వస్తుంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ గాని లేదా ఏదైనా ప్రొఫెషనల్ కోర్స్ (బిఇడి) గానీ చేస్తే మంచిదని ఎదురు చూస్తున్నాడు.

కాన్ఫరెన్స్‌లో స్పీకర్ మొదటిరోజు వాక్యం చెబుతుంటే వినయ్ శ్రద్ధగా విని నోట్స్ రాసుకొన్నాడు. మొదటి రోజు కాన్ఫరెన్స్ ముగిసింది. మరలా పలకరింపుల ప్రవాహం మొదలైంది.

రెండవ రోజు మీటింగ్ ప్రారంభమై యథా ప్రకారంగానే పాటలు పాడడం, అనౌన్స్‌మెంట్స్ చెప్పడం జరిగిపోయాయి. వాక్యం చెప్పే సమయం వచ్చింది. వినయ్ చాలా జాగ్రత్తగా వాక్యం వింటూ శ్రద్ధగా నోట్స్ రాసుకొంటున్నాడు. వాక్యం చెబుతున్న అన్న మధ్యలో ఒక జరిగిన విషయాన్ని చెబుతాను అని ఇలా చెప్పడం ప్రారంభించాడు.

"అతని పేరు రమేష్. చదివింది ఐటిఐ. ప్రస్తుతం అతను చేస్తున్న ఉద్యోగం కూడా ఐటిఐ సర్టిఫికెట్‌తోనే. ఈ ఐటిఐ సర్టిఫికెట్ అనేది అసలు

కాలేజీకి వెళ్ళకుండా, పరీక్షల సమయంలో చూసి రాసి, డబ్బులు కట్టి తెచ్చుకొన్నది. కానీ అతను ప్రభువుని నమ్మిన తర్వాత ఈ సర్టిఫికెట్ మీద ఉద్యోగం చేయడం అతనికి తప్పు అనిపించింది. ప్రభువును నమ్మిన తర్వాత ఏది ఏమైనా తప్పు చేయకూడదని ఒక నిర్ణయానికి వచ్చి తన ఉద్యోగాన్ని విడిచిపెట్టాడు. ప్రస్తుతం పదవ తరగతి అర్హత మీదే పార్ట్ టైం ఉద్యోగం చేసుకొంటూ, చిన్న బిజినెస్‌ని ప్రారంభించి చక్కగా విద్యార్థుల మధ్యలో పరిచర్య చేస్తున్నాడు". ఈ విషయాన్ని చెప్పి మత్తయి 5:6లో "నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు, వారు తృప్తి పరచబడుదురు" అనే వాక్యాన్ని వివరిస్తూ "నీతిగా, సత్యంగా బతుకుతావా?" అనే మాటను సవాలుతో చెప్పి 'చెవులు గలవాడు వినును' గాక అంటూ ముగించి ప్రార్థన చేశాడు.

ఈ వాక్యాన్ని శ్రద్ధగా వింటూ నోట్స్ రాసుకొన్న వినయ్ "నీతిగా, సత్యంగా బతుకుతావా?" అనే మాట దగ్గర ఆగిపోయి ఆలోచనలో పడిపోయాడు. మనసు మనసులో లేదు. చిన్న మొహమాటపు ప్రార్థన చేసుకొని బయటికి వచ్చేశాడు.

వినయ్ కాన్ఫరెన్స్‌కి చాలా కష్టంగా వచ్చాడు. సెలవు దొరకటం కష్టమైంది. చేస్తున్న ఉద్యోగంలో విలువ కూడా కరువైంది. అందుకనే కాన్ఫరెన్స్‌కు వచ్చే ముందు ఒక కాలేజీలో పిజి జాయిన్ అవ్వడానికి ఒప్పందం కుదుర్చుకొని అటెండెన్స్‌ని మేనేజ్ చేయడం కోసం పదివేల రూపాయలు అడ్వాన్స్ కూడా ఇచ్చి వచ్చాడు. ఉద్యోగం చేసుకొంటూనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకోవచ్చు. కాలేజీకి వెళ్ళాల్సిన పనిలేదు. పరీక్షలు చూసి రాయవచ్చు. ఒకవేళ రాయకపోయినా మేనేజ్ చేస్తారు. ఫుల్ టైం కోర్స్ కిందనే సర్టిఫికెట్ ఇస్తారు. ఏదైనా ఇబ్బంది అయితే మరలా డబ్బులతో మేనేజ్ చేస్తారు.

అందరూ భోజనాల కోసం వరుసగా లైన్లో నిలబడి ఏదేదో మాట్లాడుకొంటున్నారు. వినయ్‌కి మాత్రం నీతిగా, సత్యంగా బతుకుతావా? చెవులు గలవాడు వినును గాక! అనే మాటలు పదే పదే గుర్తుకు వస్తున్నాయి. మధ్యాహ్నం కాన్ఫరెన్స్‌లో కలతగా ఉన్నాడు.

సాయంత్రం మీటింగ్‌కి సిద్ధపడుతూ పొడి పొడిగానే ప్రార్థన చేసుకున్నాడు. 'నాతో మాట్లాడు ప్రభువా' అంటూనే తన బైబిల్ నోట్స్ తీసుకుని కాన్ఫరెన్స్ హాల్‌కి వెళ్ళాడు.

మీటింగ్ ప్రారంభమైంది. ప్రార్థన, పాటలు అయిపోయిన తర్వాత వాక్యం చెప్పడానికి డివోషనల్ స్పీకర్ నిలబడి లూకా 8:4-15 వచనాలు వివరిస్తూ 'చెవులు గలవాడు వినును గాక!' అంటూ విధేయత గురించి నొక్కి చెబుతూ యోగ్యమైన మంచి మనసుతో వాక్యం విని దానిని అవలంబించి ఓపికతో ఫలించు వారు అంటూ... (15వచనం), దేవుని వాక్యం విని దాని ప్రకారం జరిగించువాడే నా తల్లియు నా సహోదరులు (21వ వచనం) అని ప్రభువైన యేసుక్రీస్తు వారు చెప్పిన మాటను గుర్తు చేసి వాక్యం ముగించాడు.

ప్రసంగం అయిపోయిన తర్వాత వినయ్ ఒక నిర్ణయానికి వచ్చాడు. "వాక్యం వినడం కాదు. వాక్యం మాట వింటాను". అంతలో వినయ్ మనసులో "దేవా నీ మాట ప్రకారం నడుచుకోవడానికి నాకు సహాయం చేయండి" అంటూ చిన్న ప్రార్థన చేసుకొని అక్కడి నుండి లేచి వెళ్ళిపోయాడు.

భోజనాలు అయిపోయాయి. ఎవరి రూమ్స్‌కి వారు వెళ్ళిపోతున్నారు. వినయ్ మాత్రం ఒంటరిగా అక్కడ బల్లమీద కూర్చున్నాడు. వినయ్ మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తుంది.

ఇప్పుడు ఉద్యోగం అయినా మానేయాలి లేదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయినా మానేయాలి. ఉద్యోగం చాలా అవసరం. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కూడా కెరీర్ పరంగా చాలా అవసరం. ఉద్యోగంలో జీతం పెరగడం లేదు. విలువ పెరగడం లేదు. ఏమి చేయాలి! ఇంతలో వినయ్ మదిలో ఎక్కడో ఒక మూలన, "తప్పేముంది, చిన్న విషయమే కదా, ఫర్వాలేదు చాలామంది విశ్వాసులు కూడా ఇలానే చదువుతున్నారు. నీకెందుకు అంత పట్టింపు. లైట్ తీసుకో" అనే ఆలోచన పుడుతుంది. ఇలా ఆలోచనల పరంపర కొనసాగుతుండగా వెనక చెయ్యి తగిలినట్టు అనిపించి వెనక్కి తిరిగి చూసేసరికి శ్రీకాంత్ అన్న.

"ప్రైజ్ ది లార్డ్ అన్న" అంటూ వినయ్ వినయంగా నిలబడ్డాడు.

"హాయ్ తమ్ముడూ, ఎలా ఉన్నావు? ఏదో ఆలోచనలో ఉన్నావు. డిస్టర్బ్ చేశానా? అంటూ వినయ్ పక్కన కూర్చున్నాడు.

కొద్ది నిమిషాలు మాట్లాడుకొన్న తర్వాత వినయ్ తన స్ట్రగుల్‌ని శ్రీకాంత్ అన్నతో పంచుకొన్నాడు.

ఏమి చేయమంటావ్ అన్న అంటూ శ్రీకాంత్ అన్న సలహా కోసం వినయ్ ఎదురు చూస్తున్నాడు. శ్రీకాంత్ అన్న తమ్ముడూ, దేవుడు మాట్లాడిన తర్వాత చేయాల్సిందే. సలహా ఏముంటుంది? దేవుడు నమ్మదగినవాడు, సహాయం చేస్తాడు అంటూ... నా జీవితంలో జరిగిన ఒక విషయం చెబుతాను. నీకు ఉపయోగపడుతుంది.

శ్రీకాంత్ అన్న చెప్పడం ప్రారంభించాడు. నేనొక ప్రైవేట్ స్కూల్లో పని చేసేవాడిని. నెలకు 20వేల జీతం. కానీ ఎనిమిది వేల రూపాయలు మేనేజ్‌మెంట్‌కి మరలా వెనక్కి ఇచ్చి వేయాలి. రికార్డ్స్‌లో నా జీతం 20,000/- ఉండేది. కానీ వాస్తవానికి నాకు 12,000/- మాత్రమే ఇచ్చేవారు. ఒకసారి చర్చ్‌లో వాక్యం విన్నప్పుడు ఇలా చేయడం కరెక్ట్ కాదని అనిపించి ఉద్యోగానికి రిజైన్ చేసి వేరే ఉద్యోగం చూసుకోవాలని అనుకొన్నాను. వెంటనే వేరే స్కూల్లో ఉద్యోగ అవకాశం వచ్చింది. అక్కడ ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు, 'అంతకు ముందు స్కూల్లో జీతం ఎంత ఇచ్చారు?' అని అడిగారు. నేను 20,000/- అని చెప్పవచ్చు. ఎందుకంటే రికార్డ్స్‌లో కూడా అంతే ఉంది. కానీ నేను 12,000/- అని చెప్పాను. ఇంటర్వ్యూ అయిపోయి ఇంటికి వచ్చేశాను. వారం రోజుల తర్వాత సెలెక్ట్ అయినట్లు, జీతం 30,000/- అని చెప్పి ఫోన్ చేసి చెప్పారు. ఈ 30 వేలల్లో మరలా కొంత వెనక్కి ఇచ్చే అవసరం లేని ఉద్యోగం దొరికింది. తర్వాత రోజుల్లో తెలిసింది. ఈ స్కూలు వారు నేను పని చేసిన పాత స్కూల్‌కి ఫోన్ చేసి నా జీతం, జీవితం గురించి ఎంక్వయిరీ చేశారని. నేను నిజాయితీగా చెప్పిన జీతాన్ని బట్టి, అక్కడ నమ్మకంగా పని చేసినదాన్ని బట్టి, దేవుని కృప వలన ఈ స్కూల్లో 30 వేల జీతానికి ఉద్యోగం దొరికిందని ముగించాడు.

తమ్ముడూ దేవుడు నమ్మదగినవాడు. నీవు దేవుని వాక్య ప్రకారం నడవడానికి ఒక అడుగు ముందుకు వేస్తే దేవుడు తప్పకుండా నీకు సహాయకుడిగా ఉంటాడు. సరేనా! పద ఇప్పటికే చాలా లేట్ అయింది, మరల పొద్దున్నే లేవడం కష్టం అవుతుంది అంటూ అక్కడి నుండి కదలటానికి ముందు చిన్న ప్రార్థన చేసుకొని ఎవరి రూమ్‌కి వాళ్ళు వెళ్ళిపోయారు.

గ్రాడ్యుయేట్స్ కాన్ఫరెన్స్ అయిపోయింది. వినయ్ అక్కడి నుండి వెళ్ళిపోతూ దేవుని వాక్య ప్రకారం నడుచుకోవాలని నిర్ణయించుకొని ప్రార్థించి దేవునికి అప్పగించుకొన్నాడు.

అందరూ ఒక్కొక్కరు వీడ్కోలు చెప్పుకొంటూ వెళ్ళిపోతున్నారు. వినయ్ కూడా అందరికీ వీడ్కోలు చెప్పి భీమవరం వచ్చేశాడు. యధావిధిగా ఉద్యోగానికి వెళుతున్నాడు. కానీ దేవుని మాట గుర్తుకు వస్తుంది. ఉద్యోగం, పోస్ట్ గ్రాడ్యుయేషన్ రెండూ అవసరమే. అయినా డబ్బులు కట్టి కాలేజీకి వెళ్లకుండా పోస్ట్ గ్రాడ్యుకేషన్ చేయడానికి అసలు మనసు రావడం లేదు. మరుసటి రోజు కాలేజీకి వెళ్ళి తన నిర్ణయాన్ని కాలేజి వారికి చెప్పి పదివేలు వెనక్కి ఇవ్వకపోయినా ఫర్వాలేదు అంటూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ అడ్మిషన్ క్యాన్సిల్ చేసుకొన్నాడు.

వినయ్ ఆ కాలేజీ నుండి బయటకు వస్తున్నప్పుడు ఎంతో తృప్తిగా, దేవునికి సన్నిహితంగా ఉన్నట్లు అనిపించింది. నీతి కొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు. వారు తృప్తి పరచబడుదురన్న మాట ఎంత సత్యం ప్రభువా అంటూ మనసులోనే కృతజ్ఞతలు చెల్లించి కాలేజీ నుండి బయటకు వచ్చేశాడు.

సరిగ్గా ఐదు నెలల తర్వాత జెఏయం (జాయింట్ అడ్మిషన్ టెస్ట్) కి నోటిఫికేషన్ వచ్చింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఐఐటి, యన్ఐటిలలో చదవడానికి ఇది అడ్మిషన్ టెస్ట్ నోటిఫికేషన్.

వినయ్‌కి అంత తెలివితేటలు, స్తోమత కూడా లేదు. కానీ దేవుని మీద ఆధారపడి అప్లై చేశాడు. ఉద్యోగం చేసుకొంటూనే కష్టపడి దానికి ప్రిపేర్ అయ్యాడు. సెలవులను ఎక్కడ వృధాగా పోగొట్టుకోకుండా చక్కగా వాడుకొని చదువుకోగలిగాడు. ఎగ్జామ్ టైం రానే వచ్చింది. ప్రార్థనా పూర్వకంగా రాశాడు. దేవుని మహా కృపను బట్టి జెఏయంలో మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌కి సరిపడినంత ర్యాంక్ వచ్చింది. సంవత్సరానికి 50వేల స్కాలర్‌షిప్‌కి అర్హత సాధించాడు. అద్భుతంగా దేవుడు ఐఐటి ఢిల్లీలో సీట్ ఇచ్చాడు.

వినయ్ కళ్ళ వెంట కన్నీళ్లు కారుతున్నాయి. దేవుడు ఎంత నమ్మదగినవాడు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు డబ్బులు కూడా ఇచ్చాడు. వెంటనే శ్రీకాంత్ అన్నకి ఫోన్ చేసి విషయం చెప్తే అన్న కూడా ఎంతో సంతోషించాడు. ఇద్దరూ దేవుని నమ్మకత్వాన్ని బట్టి స్తుతించారు.

వినయ్ ఐఐటీ ఢిల్లీకి వెళ్ళే రోజు రానే వచ్చింది. తన ఇయు, ఇఓియఫ్‌తో కలిసి చిన్న స్తుతి కూడిక ఏర్పాటు చేసుకొని దేవుని మాట తన జీవితంలో ఎంత పనిచేసిందో చెప్పి దేవునికి వందనాలు చెల్లించాడు.

రెండు సంవత్సరాలు ఢిల్లీలో ఎమ్మెస్సీ చేయడానికి, చదువుతున్నప్పుడు క్యాంపస్ సెలక్షన్‌లో ఉద్యోగం పొందడానికి దేవుడు కృప చూపించాడు. మూడు నెలల తర్వాత నెలకు 50,000/- జీతంతో ఉద్యోగంలో చేరాడు. చాలీచాలని జీతంతో పని చేస్తూ దేవుని మాట విన్నప్పుడు దేవుడు ఎంత అద్భుతంగా తన జీవితంలో పని చేశాడో కన్నులారా చూశాడు. హృదయంతా దేవుని పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

గ్రాడ్యుయేట్స్ కాన్ఫరెన్స్‌లో రాసుకొన్న నోట్స్ తీసుకొని చూశాడు.

వాక్యం వినడం – వాక్యం మాట వినడం

నేర్చుకోవడం – నేర్చుకొన్నది నడకల్లో కనిపించడం

క్రైస్తవ జీవితం
విధేయతతో పుట్టి
విధేయతతో నడిచి
విధేయతతో ముగుస్తుంది

అంటూ తన నోట్స్‌లో రాసుకొన్న మాటలు తిరిగి చదువుకొన్నాడు.

**– యం గాలయ్య,** భీమవరం

# ప్రథమ స్థానం ఎవరికి?

మా ఊరికి రాజుగారు వస్తున్నారని తెలిసింది. ఆయనను చూడాలి. నా కోరికలు అడగాలని ఆసక్తితో పరిగెత్తాను. ఆయన నీకేం కావాలని అడిగితే మాత్రం "నాకు సొంత ఇల్లు, పొలం, కారు ప్రథమంగా కావాలని" అడుగుతాను. ఎందుకంటే చాలామంది విశ్వాసులు ఇళ్ళు, స్థలాలు, పొలాలు కొనుక్కొంటున్నారు. ఈ విషయంలో మన ఇఓియఫ్‌లలో కూడా కాంపిటేషన్ ఉంది. అందుకే నా దృష్టి అంతా ఇప్పుడు దేవుని వాక్యం, దేవుని చిత్తం, పరిచర్య కన్నా సొంత స్థలాలు, పొలాల మీద పడింది.

రాజుగారు వచ్చారు. అందరూ ఆయన వైపు ఆత్రంగా చూస్తున్నారు. ఆయన రథం సరాసరి నా దగ్గరికే వచ్చింది. ఆయన ముఖం ఎంతో ప్రకాశమానంగా ఉంది. ఆయన వచ్చి నా ముందు నిలబడి తన చేయి చాపాడు. నేను ఈ పరిస్థితి ఊహించలేదు. నా కాళ్ళ కింద భూమి ఊగినట్లు అయింది. రాజుల రాజు నా దగ్గర ఆగడం ఏంటి? అంటూ విస్తుపోయాను.

అంతలోనే తేరుకొన్నాను. నా కోరికలు గుర్తుకొచ్చాయి. నా మొదటి ప్రాధాన్యత స్థలం, కారు, పొలమే. మీరు రెండో స్థానం అన్నట్లు రెండు రూపాయల నాణేన్ని ఆయన చేతిలో కానుకగా పెట్టాను. దీనికే నేను ఎంతో త్యాగపూరితంగా ఆయనకిచ్చానని అనుకొన్నాను. వెంటనే ఆయన రథం ఎక్కి వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిపోయాక నా దగ్గరికి వచ్చిన రాజు సాక్షాత్తు మన రక్షకుడు, ప్రభువైన క్రీస్తు అని గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. అప్పటికే ఆయన రథం అద్భుతమైన వేగంతో వెళ్ళిపోయింది. దేవునికి ప్రథమ స్థానం ఇచ్చిన చాలా మంది విశ్వాసులు, మన గ్రాడ్యుయేట్స్ ఆయనతో పాటు దూతల్లా ఎగిరి సంతోషంగా వెళ్ళి పోతున్నారు. నేను ఈ లోకంలోనే విడిచిపెట్టబడ్డానని నాకు అర్థమయింది.

నేను రాజును కోరిన కోరికలకు ప్రతిఫలంగా ఆకాశం నుండి నేను ఇచ్చిన రెండు రూపాయల ను పోలిన బంగారు నాణేల సంచి నా ముందు పడింది.

అయ్యో ప్రభువా! నా జీవితంలో మీకు ప్రథమ స్థానం లేకుండా, ఈ డబ్బుతో ఇల్లు, స్థలాలు, పొలాలు కొనుక్కొని సంతోషంగా ఉండలేనని తనివితీరా ఏడ్చాను. రోదించాను. ఆయనకు ప్రథమ స్థానం ఇవ్వకపోవడం అనే ఘోరమైన తప్పిదానికి పశ్చాత్తాపపడ్డాను. కుమిలి కుమిలి ఏడ్చాను.

**– దాసరి రాజేష్,** స్టేట్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్

థాట్ ఫర్ ద మంత్



# స్త్రీ విమోచనకు స్ఫూర్తి

మహిళా దినోత్సవం స్త్రీలు రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాంఘిక రంగాలలో సాధించిన ప్రగతిని, విజయాలను గుర్తుచేసుకుంటూ జరుపుకొనే ఉత్సవం. స్త్రీ హక్కులు, స్త్రీల సాధికారిత మరియు లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించి ఘన విజయాలు సాధించిన సందర్భంగా జరుపుకొనే రోజు.

### స్త్రీ వాదం - కుటుంబ వ్యవస్థ

స్త్రీ ఉద్యమాలకు స్ఫూర్తి యేసుక్రీస్తు, బైబిల్. చాలామంది స్త్రీ వాదులు బైబిల్ స్త్రీ స్వేచ్ఛకు, సాధికారతకు వ్యతిరేకమని అంటారు. కానీ బైబిల్, యేసు స్త్రీ స్వేచ్ఛకు సాధికారతకు పునాదులు. బైబిల్ రాయబడిన పరిస్థితులు పితృస్వామ్య వ్యవస్థలో ఉన్నప్పటికీ ఎస్తేరు, రూతు లాంటి గ్రంథాలు గమనిస్తే బైబిల్ వివక్ష చూపించలేదని అర్థం అవుతుంది. కుటుంబ వ్యవస్థలో తండ్రి నాయకత్వం ఎంతో శ్రేయస్కరం. తండ్రి కుటుంబానికి రక్షణ ఇస్తాడు, పోషిస్తాడు, శ్రద్ధ తీసుకొంటాడు. కానీ స్త్రీ వాదులు కుటుంబ వ్యవస్థలో తండ్రి నాయకత్వాన్ని పురుషాధిపత్యానికి, పెత్తనానికి ఆపాదిస్తారు. కానీ అది సరైనది కాదు. ఒక కుటుంబానికి తండ్రి నాయకత్వం, భద్రత, పోషణ తప్పనిసరి. నేటి దినాల్లో స్త్రీలు కూడా ఉద్యోగాలు చేస్తూ సంపాదిస్తున్నారు. అది భర్త సంపాదనకు అదనం మాత్రమే. కుటుంబాన్ని పోషించాల్సిన ప్రాథమిక బాధ్యత తండ్రిదే. స్త్రీ వాదం పశ్చిమ దేశాల్లో చాలా కుటుంబాలను విచ్ఛిన్నం చేసింది, చేస్తుంది కూడా. పశ్చిమ దేశంలో గురక పెడుతున్నారని ఒక స్త్రీ భర్తకు విడాకులు ఇచ్చిందట. కుటుంబం ఒక వ్యవస్థ, అది విచ్ఛిన్నం కాకుండా ఉండాలంటే భర్త లేక తండ్రి నాయకత్వం తప్పనిసరి. అయితే భార్యాభర్తలు కుటుంబ వ్యవస్థను నడిపించడానికి ఒకరికొకరు లోబడతారు. దేవుడు తండ్రిని లేక భర్తను కుటుంబ వ్యవస్థకు నాయకుడిగా ఉంచాడు. హవ్వ పాపం చేసినప్పుడు దేవుడు ఆదామును లెక్క అడిగాడు. ఏలీ కుమారులు పాపం చేసినప్పుడు దేవుడు ఏలీని ప్రశ్నించాడు.

### యేసుక్రీస్తు స్త్రీ విమోచకుడు

1. 18 సంవత్సరాలుగా నడుము వంగిపోయిన ఒక స్త్రీని (లూకా 13:10-17) స్వస్థపరచి ఆమెను అబ్రహాము కుమార్తె అని సంబోధించాడు. ఆ దినాల్లో అబ్రహాము సంతానమని పురుషులు మాత్రమే గర్వంగా చెప్పుకొనే విషయాన్ని స్త్రీలకి ఆపాదించి స్త్రీ స్థితిని హెచ్చించాడు. ఆమెను సాతాను కట్లనుంచి విడిపించినందున విశ్రాంతి దినాన్ని మీరాడని విమర్శించబడ్డాడు.
2. పితృస్వామ్య వ్యవస్థలో రక్తస్రావముగల స్త్రీ అపవిత్రురాలు (లేవీ 15:25; లూకా 8:43-48). ఆమె కడగా ఉండాలి. కానీ ఆమె ధైర్యం చేసి జన సమూహంలోకి వచ్చి యేసును

ముట్టింది. యేసు ఆమెను స్వస్థపరచి, ఆమె చేత సాక్ష్యం చెప్పించాడు. ఒక స్త్రీని అపవిత్రురాలిగా యెంచవలసిన అవసరం లేదని చెప్పాడు.

3. యేసును అభిషేకించిన స్త్రీ (మార్కు 14:3-7) కుష్ఠరోగియైన సీమోను ఇంటివద్ద మున్నూరు దేనారముల విలువగల అత్తరును యేసు తలపై పోసి ఆయన్ను అభిషేకించింది. ఆమెను విమర్శించిన వ్యక్తులతో ఆమె జోలికి పోవద్దని, ఆమె యేసు యెడల మంచి కార్యము చేసిందని, అది ఆయన భూస్థాపన నిమిత్తమని ప్రశంసించాడు.

4. నాయీను విధవరాలు (లూకా 7:11-16), ఆమె ఏకైక కొడుకు చనిపోయాడు. ఆమె నిస్సహాయతను చూచి ఆమెయందు కనికరపడి అతనిని బతికించడం ద్వారా ఆ స్త్రీని విమోచించి ఆమెకు భద్రత కలుగజేశాడు.

5. వ్యభిచారంలో పట్టబడిన స్త్రీ (యోహాను 8:1-8). ఆరోజు ఆ స్త్రీ చనిపోయేదే. పెద్దవారు మొదలు కొని చిన్నవారి వరకు ఆమెను రాళ్ళతో కొట్టి చంపడానికి వచ్చారు. మీలో పాపము లేనివాడు ఆమె మీద మొదట రాయి వేయమని చెప్పి అందరూ పాపం చేసినవారే అని నిరూపించాడు. ఆ స్త్రీకి భద్రత, అంగీకారం, నిరీక్షణ ఇచ్చి పాపం చేయవద్దని హెచ్చరించి పంపించాడు.

## యేసు పరిచర్యలో స్త్రీల పాత్ర

1. పునరుత్థాన వార్తను మొట్టమొదటిగా ఈ లోకానికి తీసుకొని వచ్చింది ఒక స్త్రీ. ఇది స్త్రీ జాతికే గొప్ప ఆధిక్యత (మార్కు 15:47; మత్తయి 28:1-10).

2. సమరయ స్త్రీ, యేసును మెస్సీయగా గుర్తించి సమరయులకు పరిచయం చేసింది. యేసు సమరయ స్త్రీతో బహిరంగంగా మాట్లాడడం ద్వారా ఆ దినాల్లో ఉన్న లింగ, కుల వివక్షను అధిగమించాడు (యోహాను 4:4-40).

3. మార్త, మరియ యేసు పరచర్యకు వారి గృహాన్ని తెరచి ఓపెన్‌హోంగా ఉంచారు. దానికి యేసు నుంచి వారు మంచి ప్రతిఫలం పొందారు. చనిపోయిన తమ సహోదరుడు లాజరును సజీవంగా తిరిగి పొందారు (యోహాను 11:44).

4. మగ్దలేనే మరియ, యోహన్న, సూసన్న (లూకా 8:1-3). వారు యేసుతో ఉన్నారు. వారికి కలిగిన ఆస్తితో ఉపచారం చేశారు.



5. మరియ యేసు పాదాల చెంత కూర్చొని ఆయన బోధ విని ఆయన శిష్యురాలిగా పరిగణించబడింది. నేటి సంఘాలలో ఎక్కువమంది విశ్వాసులు స్త్రీలే.

## స్త్రీల పట్ల యేసు, బైబిల్ దృక్పథం

యేసు ప్రేమకు మూలం. యేసు సంఘాన్ని ప్రేమించి సంఘం ముడతయైనను, కళంకమైనను లేకుండా పరిశుద్ధంగా నిర్దోషమైనదిగా తన యెదుట నిలువబెట్టుకోవాలని తన్నుతాను అర్పించుకొన్నాడు. పేతురు తన పత్రికలో రాస్తూ జీవము అనే కృపావరంలో భార్యలు పాలివారై యున్నారని యెరిగి ఎక్కువ బలహీనమైన ఘటమని భార్యను సన్మానించి మీ ప్రార్థనలకు ఆటంకం కలగకుండా జ్ఞానము చొప్పున కాపురము చేయమని చెప్పాడు.

## ముగింపు

కుటుంబంలో తల్లి పిల్లలకు మొదటి ఉపాధ్యాయురాలు. బైబిల్లో రాజుల చరిత్ర రాసేటప్పుడు తల్లిపేరు ప్రతిసారి ప్రస్తావించడం జరిగింది. ఇది తల్లి యొక్క ప్రాముఖ్యతను, బాధ్యతను గుర్తు చేస్తుంది. దేవుని దృష్టిలో స్త్రీ పురుషులు సమానము. లింగ వివక్ష, పురుషాధిక్యం, పెత్తనం, స్త్రీ వాదం బైబిల్ దృష్టిలో సరైనవి కావు. వీటిని మనం ఖండించాల్సిందే. అయితే కుటుంబానికి నాయకుడు తండ్రి లేక భర్త అనే విషయాన్ని గమనించాలి. స్త్రీలు దేవుని స్వరూపంలో చేయబడ్డారు, పురుషులతో సమానం కాబట్టి వారిని గౌరవించాలి. కుటుంబ వ్యవస్థలో ఒకరికొకరు లోబడుతూ పిల్లల్ని వివక్ష లేకుండా పెంచుతూ దేవుని మాదిరిని చూపించాలి. స్త్రీ దినోత్సవం సందర్భంగా స్త్రీని గౌరవిద్దాం. స్త్రీల యొక్క తలాంతులను, వరాలను గుర్తిద్దాం, ప్రోత్సహిద్దాం.

**– జి. జెర్మియా ప్రసాద్,**
ఏపి-ఇజియఫ్ స్టాఫ్, నంద్యాల

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2024-2026**

**Date of Printing: 25-02-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# నేను ఆయన సొత్తు

పసితనపు మబ్బులు
ముసి ముసిగా తొలిగిపోతూ
రంగుల ప్రపంచంలో హంగులతో
అడుగు పెట్టాలనుకుంటున్న వేళ!
అంతరంగంలో తెలీని ఆవేదన
అందరిలో ఉన్నా అదే ఆలోచన
అబ్బాయిగా పుడితే అంత ఆనందమెందుకు?
అమ్మాయి అంటే ఇంత అలుసెందుకు?
పలురకాల ప్రశ్నలే నాకు సమాధానాలు
ఫిర్యాదులే నా పలకరింపులు!

తల్లి గర్భంలో నాకు రూపం రాకముందే
నన్నెరిగిన ప్రభువు
ప్రేమతో నన్ను పలకరించాడు
నా హృదయం తనకిమ్మన్నాడు
ఇకనుండీ నీవు నా సొత్తన్నాడు
నా లేత భావాల గాయాలకు లేహ్యంలా
నా అసందర్భ ప్రశ్నలకు జవాబులా
లేఖనాల వెలుగు నాపై ప్రకాశించింది
ఆదికాండం నుండి ప్రకటన గ్రంథం దాకా
ఆడవాళ్ళు ఎంత అద్భుతమో
ఆనవాళ్ళు చూపించింది!

దేవదూతలకు ఆతిధ్యమివ్వాలన్నా
దేవుని ప్రజలను ముందుండి నడిపించాలన్నా
శత్రుసైన్యాన్ని సంహరించాలన్నా
తీర్పు తీర్చి సమాధానపరచాలన్నా
మరణశాసనం మారిపోయేలా చేయాలన్నా
పాడైన పట్టణాలను బాగుచేయాలన్నా
అతివలు ఎంత అవసరమో తెలుసుకున్నా

మహిమరూపి మానవ జన్మలో
మనిషిగా జీవించిన జీవితంలో
మ్రాను మీద మరణంలో
మరణాన్ని జయించి లేచిన పునరుత్థానంలో
స్త్రీలకిచ్చిన ఘనత
నన్ను గర్వించేలా చేసింది
నన్ను మైమరిచేలా చేసింది!

ఘనురాలు గుణవంతురాలు
జ్ఞానవంతురాలు
నగరు కోసం చెక్కిన స్తంభం
అరుదైన ఆణిముత్యం
అందమైన ఆభరణం
నా ప్రభువు నాకిచ్చిన బిరుదులు
అవును...
నేను నా ప్రియుని దానను!
అతడు నా వాడు!

– గొంగటి మేరిజాయ్, ఆదోని